నరహంతకి

సుంకరి రాంప్రసాద్

"రాంకుమార్! మినీకాయ్ దీవుల గురించి ఎప్పుడైనా విన్నావా?"

అంతకు క్రితం టేబిల్ పై ఉంచిన ఫైలును మళ్ళీ తిరగ వేస్తూ అడిగారు సి బి ఐ. చీఫ్ కరుణాకర్.

"అరేబియా సముద్రంలో లక్షదీవుల క్రింద, కొంచెం నైరృతి దిశగా వెళ్తే కనిపించే దీవులేగా.... సర్!" అన్నాడు రాంకుమార్ ఆసక్తిగా.

"యూ ఆర్ షార్ప్!" రాంకుమార్ వంక మెచ్చుకోలుగా చూసారాయన.

"ఈ మధ్య ఆ దీవులలోని ప్రజలు కొన్ని విచిత్రమైన రోగాలకు గురియై మరణిస్తున్నట్లుగా ప్రభుత్వానికి సమాచారం అందింది.... రాంకుమార్,

వెంటనే ఆయిదుగురు డాక్టర్లున్న ఒక బృందాన్ని సర్వే నిమిత్తం ఆ దీవులకు పంపడం జరిగింది.

పదిరోజులపాటు రోగగ్రస్తులైన ప్రజలనూ, ఆ పరి

సరాలనూ, వారి అలవాట్లనూ, వారి ఆహార నియమాలను క్షుణ్ణంగా పరిశీలించారు ఆ డాక్టర్లు.

ఆ రోగుల రక్తాన్ని, మల, మూత్రాలను పరీక్షించారు. ఆ రోగుల శరీరాలలో అత్యంత విషపూరితాలైన రోగాణువులను వారు కనుగొన్నారు.

'ఇన్నాళ్ళూ ఎంతో హాయిగా, ఆరోగ్యంగా జీవిస్తున్న ఆ ప్రజలను రోగగ్రస్తులను చేస్తున్న ఆ విషపూరితాలైన రోగాణువులు వారి శరీరాలలోనికి ఎలా వస్తున్నాయి?' అన్న అంశంపై వారు విస్తృత పరిశోధనలు గావించారు.

వారి పరిశోధనల్లో తేలిన నిజం ఏమిటంటే:

మినీకాయ్ దీవుల చుట్టూ వ్యాపించి వున్న సముద్ర జలాలలో లభిస్తున్న చేపల ద్వారా ఈ చిత్రవిచిత్రమైన రోగాలు అక్కడి ప్రజలకు సంక్రమిస్తున్నాయి.

వారు వెంటనే తమ పరిశోధనా ఫలితాలను ప్రభుత్వానికి పంపారు."

"సర్! ఒక్క సందేహం!"—అతని మాటలకు అడ్డు పడుతూ అడిగాడు రాంకుమార్.

"గో అన్ మైడియర్ బోయ్!" ఆరిపోయిన పైప్‌ను తీరిగ్గా ముట్టించుకుంటూ అన్నారు కరుణాకర్.

"నాగరికతా వాసనలుకూడా సోకని ఆ మినీకాయ్ దీవులలోని జలాలనూ, జలచరాలనూ విషపూరితాలుగా చేయడానికి అక్కడ పరిశ్రమలుగాని, పట్టణాలు గాని లేవే!

మరి.... ఎలా అక్కడి జలచరాలు విషపూరితాలౌతున్నాయి?" అన్నాడు రాంకుమార్.

"సరిగ్గా నీలాంటి సందేహమే ఆ వైద్యబృందానికీ

వచ్చింది రాంకుమార్!

అందుకే, ఆ దీవి పరిసరాలను మరింత విస్తృతంగా పరిశోధించాలని ఒక స్టీమ్ బోట్‌లో బయలుదేరారు వారు.

కాని, మినీకాయ్ దీవులను విడిచి కొద్ది కిలోమీటర్ల దూరమైనా పోకుండానే, వారు ప్రయాణిస్తున్న స్టీమ్ బోట్ దేనికో గుద్దుకొని ముక్కలైపోయింది. ఇరవై నాలుగు గంటల తరవాత ఆ డాక్టర్ల శవాలు ఒడ్డుకు కొట్టుకు వచ్చాయి.

సముద్ర గర్భంలో ఉండే పగడపు గుట్టలకు గుద్దుకోవడంవలన ఆ ప్రమాదం జరిగి ఉంటుందని మినీకాయ్ పోలీసు అధికారులు రిపోర్టు పంపారు.

రాంకుమార్!

ఆ డాక్టర్ల దుర్మరణంతో వారు చేస్తున్న పరిశోధన మధ్యలోనే ఆగిపోయింది.

మినీకాయ్ దీవులలోని మత్స్యాలు విషపూరితాలెందుకవుతున్నాయన్న ప్రశ్న రహస్యంగానే ఉండిపోయింది.

ఆ రహస్యాన్ని ఛేదించే బాధ్యతను మన డిపార్టుమెంట్‌కు అప్పగించింది మన ప్రభుత్వం.

మైడియర్ బోయ్!

స్వచ్ఛమైన ఆ సాగర జలాలను విషపూరితాలుగా చేస్తున్న శక్తి యేదో నీవు కనిపెట్టాలి.

మనం తొందరపడి ఈ విషవలయాన్ని ఛేధించకపోతే భవిష్యత్‌లో మినీకాయ్ దీవులలో మానవజాతే అంతరించిపోతుందేమో!"

ఎంత అణచుకుందామన్నా, దాగని ఉద్వేగంతో కరుణాకర్ గొంతు చిన్నగా వణికింది.

"మినీకాయ్ దీవులకు నన్ను ఎప్పుడు బయలుదేర మంటారు సర్?"

రాంకుమార్ ముఖంలో స్పష్టంగా కనిపిస్తున్న దీక్ష, పట్టుదలను చూసి సంతృప్తిగా తలాడించారు కరుణాకర్.

"దట్స్ ద స్పిరిట్ మై బోయ్!

ఈ రోజు సాయంత్రమే నీ ప్రయాణం. త్రివేంద్రంకు నీ పేర ఫ్లయిట్ టిక్కెట్ రిజర్వ్ చేయించబడింది. అక్కడనుండి మనీకాయ్ దీవులకు నీవు బోట్‌లో ప్రయాణించాల్సి ఉంటుంది.

నీకు కావాల్సిన సహాయ, సహకారాలందించమని త్రివేంద్రం పోలీస్ కమీషనర్‌కు ఆదేశాలివ్వబడ్డాయి.

బై ద బై. ఈ ఎసైన్‌మెంట్‌లో మెడికల్ సైన్స్‌లో పరిజ్ఞానం వున్న మనిషియొక్క సహకారం కొంత నీకు అవసరం రావచ్చు.

అందుకే డాక్టర్ మాధవిని నీతోపాటు పంపిస్తున్నాను. ఈ ఎసైన్‌మెంట్‌లో ఆమె నీతోపాటు కలసి పనిచేస్తుంది."

"డాక్టర్ మాధవి అంటే...." సందేహంగా అడిగాడు రాంకుమార్.

"ఆమె త్రివేంద్రంలోని మన ఏజెంట్ రాంకుమార్! ఎ వెరీ బ్రిలియంట్ యంగ్ గర్ల్. షి గాట్ ద డాక్టరేట్ ఇన్ ఓషనాలజీ.

అయితే ఈ ఎసైన్‌మెంట్‌కు ఆమెను ఎంపిక చేయడానికి మరో ప్రత్యేకమైన కారణం ఉంది."

అర్థం కానట్లు తనతంత కెల్లబోతూ చూస్తున్న రాంకుమార్‌ను చూసి చిన్నగా నవ్వాడాయన.

"ఇక్కడ, నీకు మినీకాయ్ దీవుల గురించి కొంత వివ

రంగా చెప్పాల్సి వుంటుంది రాంకుమార్!

పేరుకు మినీకాయ్ దీవులు భారతప్రభుత్వ అధీనంలో వున్నా, ఆ దీవిలోని ప్రజలు, అక్కడి పాలనా యంత్రాంగం అంతా చిమన్ భాయ్ పటేల్ చేతిలో ఉంది.

మినీకాయ్ దీవులకు అతడు మకుటంలేని మహారాజు. అనాగరికులైన ఆ దీవిలోని ప్రజలకు అతడి మాట వేద వాక్కు.

శివుడాజ్ఞ లేనిదే చీమయినా కుట్టనట్లు, అతని అనుమతి లేనిదే క్రొత్తవారు ఆ దీవుల్లో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేరు.

అలాంటి చిమన్ భాయి పటేలుకు స్వయంగా మేనకోడలు అవుతుంది మిస్ మాధవి."

తనతోపాటుగా మిస్ మాధవిని మినీకాయ్ దీవులకు యెందుకు పంపిస్తున్నారో అప్పుడు అర్థం అయింది రాంకుమార్ కు.

"మిస్ మాధవి సి.బి.ఐ. ఏజెంట్ అన్న విషయం ఆమె అంకుల్ కు, అదే చిమన్ భాయిపటేలుకు తెలుసా సర్?" అనుమానంగా అడిగాడు రాంకుమార్.

"నో మైడియర్ బోయ్!

షి కెప్ట్ ఇట్ సీక్రెట్లీ!

తన ఐడెంటిటీని తన కన్నతల్లి ముందు కూడా బయట పెట్టలేదామె" అన్నారు కరుణాకర్.

సంతృప్తిగా తలాడించాడు రాంకుమార్.

2

"ఏమ్మా మాధవీ!

ఇన్నాళ్ళకు మీ అంకుల్ ను చూడడానికి తీరిక దొరి

కిందా? నిన్ను చూస్తుంటే అమ్మను చూసినట్లే వుంది. అమ్మ ఎలా వుంది మాధవీ?" ఆప్యాయంగా మాధవి తల నిమురుతూ అన్నాడు చిమన్ భాయ్‌పటేల్.

సోఫాలో ఆతని ప్రక్కనే ఒద్దికగా కూర్చుని వుంది ఆమె. వారికి కాస్త దూరంలో వినయంగా చేతులు కట్టుకొని నిలబడ్డ యువకుని కేసి అనుమానంగా చూశా రాయన.

"ఆ అబ్బాయి ఎవరమ్మా?"

"మన డ్రైవర్ అంకుల్! పేరు కుమార్. నా థీసిస్‌కు కావాల్సిన మెటీరియల్ కోసం నేను ఈ దీవి చుట్టూ సముద్రంలో ప్రయాణించాల్సి ఉంటుంది. డిఫరెంట్ ప్లేసెస్‌లో వాటర్‌నూ, ఫిషెస్‌నూ కలెక్ట్ చేసుకోవాలి. వీటన్నిటికీ ఎలాగూ నాకు ఒక అసిస్టెంట్ కావాలి.

అంకుల్! యూ నో! కుమార్ ఈజ్ ఏన్ ఎక్స్‌పర్ట్ ఇన్ బోటింగ్!

"అప్పుడప్పుడు నేను డిక్టేట్ చేస్తుంటే నా నోట్సులను కూడా ప్రిపేర్ చేస్తుంటాడు.

యూ నో అంకుల్! హి ఈజ్ ఎ గ్రాడ్యుయేట్! బి.యస్సీ వరకూ చదివాడు. పాపం ఎక్కడా ఉద్యోగం దొరక్క మన దగ్గర డ్రైవర్‌గా చేరాడు.

నా కన్నివిధాలుగా సహాయంగా ఉంటాడని, నాతో పాటు కుమార్‌ను కూడా తీసుకువచ్చాను అంకుల్."

తనను మెచ్చుకుంటూ మాధవి చెబుతున్న మాటలకు ఇబ్బందిగా కదిలాడు కుమార్.

"కొంతానికి మంచి అసిస్టెంటునే సంపాదించావు మాధవీ!"

సన్నగా వీణ తీగెలు మీటినట్లు వినిపించిందో కంఠ ధ్వని.

మాధవి, కుమార్ చటుక్కున తలలు పైకెత్తి చూశారు.

ఒక అందమైన యువతి వయ్యారంగా నడుచుకుంటూ మెట్లు దిగి వస్తోంది.

తనను అంత చనువుగా పేరుపెట్టి పిలుస్తోన్న ఆ అపరిచితురాలు యెవరా అని ఆశ్చర్యంగా చూస్తోంది మాధవి.

“మా అత్తయ్య ఆయేషా!”—ఆ యువతిని మాధవికి చూపుతూ చెప్పాడు పటేల్.

“మీకు చెప్పనేలేదు మాధవీ!

ఇటీవల బొంబాయి వెళ్ళినప్పుడు ఆయేషాతో పరిచయం కల్గింది. అప్పటి పరిస్థితులలో అనుకోకుండా మా వివాహం జరిగిపోయింది”

బట్టతలపైన మిగిలిన కాస్త నెరిసిన జుట్టును ఇబ్బందిగా తడుముకొంటూ అన్నాడతడు.

“నమస్తే ఆంటీ!” సోఫాలో నుండి లేచి, రెండు చేతులనూ జోడించింది మాధవి. ఆమె భుజాలను ఆప్యాయంగా నిమిరింది ఆయేషా.

తన వయసే వున్న ఆయేషాను ఆంటీ అని మన్నించటం మాధవికి, ఆమె ముందు యెంతో పెద్దదానిలా మసలటం ఆయేషాకూ.... చెప్పలేనంత యిబ్బందిగా వుంది. ఆయేషా చూపులు మళ్ళించి కుమార్‌ను నఖశిఖపర్యంతం పరిశీలించసాగింది.

పడుచు అత్తయ్య ప్రక్క, ముసలి మామయ్యగా, మేనకోడలు మాధవి ముందు నిలబడాల్సి రావటం

పటేల్‌కు మరింత ఇబ్బందిగా వుంది.

అయితే వీరందరి కంటే తెగ ఇబ్బంది పడుతున్నాడు కుమార్.

ఆయేషా చూపులను భరించటం అతనికి భరించలేనంత ఇబ్బందిగా వుంది

ఆమె చూపుల్లో భేటీ పడలేక, తలను పైకెత్తి, పై కప్పుకు వ్రేలాడుతున్న షాండిలర్స్ యొక్క సౌందర్యాన్ని సీరియస్‌గా అధ్యయనం చేయసాగాడతడు.

తాళి కట్టిన భర్త ప్రక్క నుండగానే పరాయి మగవాడితంక ఆకలి చూపులు చూస్తోన్న ఆయేషా స్వభావాన్ని అంచనా వేయడానికి ప్రయత్నిస్తోన్నాడు కుమార్.

త్రివేంద్రంలో ఉన్న తన తల్లి గురించి, తన చదువు గురించి కబుర్ల మీద కబుర్లు చెప్పేస్తూ పటేల్ అంకుల్‌ను ఊదరగొట్టేయసాగింది మాధవి.

ఆ క్షణంలో ఆమెను చూసినవారు ఎవరైనా, ఆమెను అమాయకురాలైన ఆడపిల్ల పాపం! అనుకుంటారు తప్ప, అనుభవజ్ఞురాలైన ఒక సి.బి.ఐ. ఏజెంట్ అని కలలో కూడా ఊహించలేరు.

అంత అద్భుతంగా తన పాత్రను పోషిస్తూంది ఆమె. ఆమెతంక ప్రశంసాపూర్వకంగా చూశాడు కుమార్.... అలియాస్ రాంకుమార్ ద స్టార్ ఏజంట్ ఆఫ్ సి.బి.ఐ

3

నిశిరాత్రి నిరజాం బిగి కౌగిట సొక్కి. సోలిన అరుణ భానునికి సుప్రభాతం పాడటానికా అన్నట్లు పక్షులు కిలకిల రావాలు చేస్తోన్నాయి.

రాత్రంతా కురిసిన మంచు, ఆకులలో నుండి బొట్లు, బొట్లుగా నేలమీదకు జాలువారుతూంది.

వస్తూ, వస్తూ, తనతో పాటుగా, రాలిన ఇప్పపూల సుగంధాన్ని తెచ్చి, ఆ తోపంతటికీ పంచి మరీ వెళ్ళిందో పిల్ల తెమ్మెర.

సంపెంగ పొదలో నుండి మెల్లగా పైకి వస్తున్న ఒక కుందేళ్ళ జంట....ఎండుటాకుల పై ఏవో పాద ధ్వనులు వినిపించడంతో, చెవులు రిక్కించి ఓసారి అటూ, ఇటూ చూపులు సారించి, చెంగున మళ్ళీ పొదలలోనికి దూకేశాయి.

తల్లి ఒడిలో ఒద్దికగా కూర్చుని, బుద్ధిగా స్తన్యాన్ని గ్రోలుతున్న ఒక పిల్లకోతి....అంత ఉదయాన్నే తమ తోపులోనికి వస్తున్న ఆ ప్రాణులెవరా అని ఆశ్చర్యంగా చూసింది.

అయితే....మౌనంగా నడుచుకొంటూ వస్తోన్న ఆ యువతీయువకుల దృష్టి పరవశింపజేసే ఆ ప్రకృతి అందాల పై లేదు. వారేదో దీర్ఘంగా ఆలోచిస్తోన్నారు.

నడుస్తోన్న రాంకుమార్ ఒక్క క్షణం ఆగి, చుట్టూ చూశాడు. ఆ తోపులో తాము తప్ప మరో నరమానవుడు లేడని ధృవపరచుకొన్నాక, సంతృప్తిగా తలాడిస్తూ ప్రక్కనున్న మాధవివంక చూశాడు.

"ఇప్పుడు చెప్పండి మాధవీ! వాట్ ఆర్ యువర్ ఫైండింగ్స్?" అన్నాడతడు మెల్లగా.

వారు ఆ దీవికి వచ్చి అప్పుడే ఇరవై నాలుగు గంటలు కావస్తూంది. ఆ ముందురోజు పగలంతా ఆ దీవినంతా స్పీడ్ బోట్ పై ఒకసారి చుట్టివచ్చారు వారు. ఆ దీవి చుట్టూ వున్న సముద్రంలో నుండి వివిధ దిక్కులలో

జలాన్ని, జలచరాలను సేకరించారు.

ఆ రాత్రికి వాటిని టెస్టు చేసి, రిపోర్టు తయారుచేసి వుంచమని, మాధవితో చెప్పాడతడు. తను ఎక్స్పెరిమెంట్ కు సంబంధించిన యే విషయాన్నీ ఆ ఇంటి పరిసరాల్లో మాట్లాడవద్దని, ఉదయాన్నే, మార్నింగ్ వాక్ సాకతో, ఆ యింటికి కాస్త దూరంలో వున్న అడవిలోనికి వెళ్దామని, ఏ విషయాన్నయినా అక్కడ ఏకాంతంగా డిస్కస్ చేద్దామని చెప్పాడతడు.

“మన వైద్య బృందం అనుమానించినది నిజమే కుమార్! ఈ దీవి చుట్టూ వున్న సాగర జలం పూర్తిగా కలుషితం అయిపోయింది. విషతుల్యమైన ఈ జలంలో పెరుగుతున్న చేపల ద్వారానే ఇక్కడి ప్రజలకు, విచిత్రమైన ఈ రోగాలు సంక్రమిస్తున్నాయి,”

జాకెట్ లో నుండి ఒక కాగితాన్ని పైకి తీస్తూ అంది మాధవి.

“ఈ సాగర జలం ఎందుకు విషతుల్యమయిందంటారు మాధవీ?”

“జల కాలుష్యానికి ఎక్కడయినా, ఎప్పుడయినా ఒకే, ఒక కారణం వుంటుంది కుమార్! అది: ప్రమాదకరమైన రసాయనాలు నదీ సాగర జలాలలో కలియడం!”

“కాని, ఈ మినీకాయ్ దీవులలోనికి రసాయనాలు ఎలా వస్తాయి మాధవీ?

నో! యింకేదో వుంది.

ఈ జల కాలుష్యానికి కారణం యింకేదో వుంది—”

పెదవులు బిగించి యేదో ఆలోచిస్తూ అన్నాడతడు.

"దస్, అలా కావడానికి ఒకే ఒక ఛాన్స్ ఉంది" అందామె సాలోచనగా.

"ఏమిటది మాధవీ!" ఆత్రంగా అడిగాడు. రాం కుమార్.

"కాడ్మియమ్!"

"కా....డ్మి....య....మ్....!"—ఆమె పలికిన పదాన్ని ఆశ్చర్యంగా మరోసారి ఉచ్ఛరించాడు అతడు అర్థం కానట్లు ఆమెవంక చూస్తూ.

ఆమె సాలోచనగా తల పంకించింది.

"ఈ మధ్య యేదో మేగజైన్‌లో చదివాను కుమార్!

భారతదేశం నుండి దిగుమతి అవుతోన్న చేపల ద్వారా, వాటిని వినియోగిస్తున్న తమ ప్రజలు రోగగ్రస్తులవుతున్నారని తెలిసి, ఆ చేపల దిగుమతిని నిషేధించింది ఇటలీ ప్రభుత్వం.

ఆ వార్తతో కంగారుపడింది మన ప్రభుత్వం. కొన్ని కోట్ల విదేశీ మారకద్రవ్యాన్ని వదులుకోవడం అంటే.... మాటలా!

పరిశ్రమలు విసర్జించిన రసాయనాల ప్రభావం వలన కాలుష్యమయిన సముద్రజలాలలో పట్టుబడే చేపలను విదేశాలకు ఎగుమతి చేయడాన్ని ఏనాడో నిషేధించింది మన ప్రభుత్వం.

మరి, ఇతర ప్రాంతాలలో పట్టుబడ్డ చేపలు కూడా ఎందుకు విషపూరితం అవుతున్నాయి?

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ అంశంపై సమగ్ర పరిశోధనను జరిపింది డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఓషనాలజీ.

అప్పుడు బయల్పడింది ఈ 'కాడ్మియం' రహస్యం.

'కాడ్మియం' అన్నది ఒక లోహం. సముద్ర గర్భంలో కాడ్మియం లాంటి లోహాలుంటే ప్రదేశాలలో, వీటి ప్రభావం వలన, అక్కడి సాగర జలాలు కలుషితమౌతున్నాయి.

ఆ జలాలలో పట్టబడే చేపలు విషపూరితా లౌతున్నాయి.

చేపలు పట్టబడే ప్రాంతాలలో కాడ్మియం లాంటి లోహాలు వుండటంవలన సముద్రజలాలు కాలుష్యం గాకుండా జాగ్రత్తలు తీసుకొంటామని మన దేశం ఇటలీ ప్రభుత్వానికి హామీ ఇచ్చింది.

దానితో చేపల దిగుమతిపై నిషేధాన్ని ఇటలీ ప్రభుత్వం తొలగించివేసింది."

"సో, యిప్పుడు మనం కూడా ఈ మినీకాయ్ దీవుల పరిసరాల్లో 'కాడ్మియం' లాంటి లోహాలు ఏవైనా నిక్షిప్తమై ఉన్నాయేమో పరిశోధించా లంటావు?" ఆమె వంక సాలోచనగా చూస్తూ అడిగాడు రాంకుమార్.

ఔనన్నట్లు తలాడించింది ఆమె.

"కాని, దానికి ముందుగా మనం యింకో పనిని చేయాలి మాధవీ!

మొదట అమాయకులైన ఈ దీవి ప్రజల ప్రాణాలను కాపాడాలి మనం. అంటే వీరు కొన్ని రోజులవరకూ, ఏ జలచరాన్నీ ఆహారంగా తీసుకోకుండా చేయాలి" అన్నాడతడు.

"దట్స్ ఇంపాజిబుల్ కుమార్!

"మినీకాయ్ దీవుల ప్రజలయొక్క ముఖ్యాహారం ఈ చేపలే! చేపలవేట వారి ప్రధానవృత్తి!

తమ వృత్తిని, భుక్తిని మానమని ఎవరు చెప్పినా

వినరు వారు."

"వింటారు మాధవీ! ఒకే, ఒక వ్యక్తి ఆజ్ఞను వారు అక్షరాలా పాటిస్తారు."

"ఎవరి ఆజ్ఞ! మా అంకుల్ దా?" ఆశ్చర్యంగా అడిగింది ఆమె.

కాదన్నట్లు అడ్డంగా తలూపాడు అతడు.

"మరి, యింకెవరు?" ఆత్రంగా అడిగింది ఆమె.

"జ....న్మ....కా....ర....ణ్...!" — ఒక్కొక్క అక్షరాన్నే ఒత్తిపలుకుతూ చెప్పాడతడు.

ఆ పేరు వింటూనే ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టిందామె. ఆమెకు తెలుసు జన్మకారణ్ అంటే ఎవరో.

"కాని....అతడలా చెబుతాడా!" సందిగ్ధంగా అడిగింది ఆమె.

"చెప్పడు మాధవీ!

"మనమే ఈ ప్రజలకు అతనితో అలా చెప్పిస్తాం" — ఒక నిశ్చయానికి వచ్చినట్లు దృఢంగా అన్నాడతడు.

అతని ప్లాన్ ఏమిటో అర్థంగాక, అతనివంక తెల్లబోతూ చూసిందామె.

4

విశాలమైన ఆ పచ్చిక మైదానం మిసీశాయ్ ఆదివాసు ప్రజలతో క్రిక్కిరిసి వుంది.

మైదానం అంచునున్న అడవిలో పూచిన ఎర్రని మోదుగుపూలు సంధ్యాకాలపు కెంజాయి వెలుగులో మరింతగా తళుకు లీనుతున్నాయి.

సాయంత్రపు పిల్లగాలికి గుత్తులు, గుత్తులుగా వ్రేలాడుతున్న గోల్, గోలీ పుష్పాలు మెల్లగా తలలాడిస్తూ

న్నాయి.

స్త్రీలు, పురుషులు మిలలకు మాత్రం మోకాళ్ళ దిగని ముదురు రంగు వస్త్రాలను ధరించారు. స్త్రీలు వెడల్పాటి ఆకులతో కూర్చబడ్డ ఒక హారం లాంటిది మెడలో ధరించారు. ఎత్తుగా చుట్టిన వంకర ముడిలో పీయు పుష్పాలను అందంగా తురుముకొన్నారు.

మైదానం మధ్యలో—కండలు తిరిగిన యువకుడొకడు పెద్ద డోలును లయబద్ధంగా వాయిస్తున్నాడు.

ఆ డోలు చుట్టూ ఆరేడు వలయాలుగా, ఒకరి చేతులను ఒకరు పట్టుకొని నిలుచుని వున్నారు వారు. డోలు శబ్దానికి అనుగుణంగా నాట్యం చేస్తున్నారు.

నాట్యం చేసే ప్రతి వ్యక్తి చేతులలో పొడవైన కర్రలున్నాయి. నాట్యం చేసేవారు వలయంగా నిలబడి లయబద్ధంగా అడుగులు వేస్తూ తమ కర్రలతో ఎదుటి వ్యక్తి కర్రలపై కొడుతున్నారు. ఉత్సవంలో డోలు శబ్దంతో పాటు పరస్పరం తాకే కర్రల శబ్దం, స్త్రీల శ్రావ్యమైన గీతాలు.. అన్నీ కలగలసి ఒక విచిత్రమైన నాదం ఉత్పన్నమౌతోంది.

వారు పాడే పాటలు ఉత్తేజం కలిగించే శృంగార భరితమైన పాటలు.

మైదానంలో ఓ ప్రక్క, వెదురు బొంగులతో చేసిన ఆసనాలపై కూర్చుని ఆ ఉత్సవాన్ని. ఉత్సాహంగా చూస్తోన్నారు చిమన్ భాయ్ పటేల్, ఆయేషా, మాధవి, కుమార్.

నాట్యం జోరుగా సాగుతూంది.

అంతలో ....

జోరుగా మ్రోగుతున్న డోలు ఒక్కసారిగా మూగ

పోయింది. ఉత్సాహంగా నాట్యం చేస్తున్న ఆ ప్రజలు.... నాట్యాన్ని ఆపి నేలమీద మోకరిల్లి కూర్చున్నారు.

"జన్మకారణ్ .... జన్మకారణ్ ...."

ఒక్కసారిగా ఆ మైదానం అంతా 'జన్మకారణ్' అన్న ఒకే ఒక్క మాటతో హోరెత్తిపోయింది.

పశ్చిమ దిక్కునున్న అడవిలో నుండి....

ముందుగా మండుతున్న దివిటీలు పట్టుకొని యిద్దరు యువకులు నడుస్తున్నారు.

నలుగురు బలిష్ఠులైన యువకులు వెదురు బొంగులతో చేసిన తక్తాను మోసుకొని వస్తున్నారు. పులి చర్మాలతోనూ, నెమలి పింఛాలతోనూ అలంకరింపబడిన ఆ తక్తాపై ఠీవిగా కూర్చుని వున్నాడొక అరవైయేళ్ళ వృద్ధుడు.

ఎర్రని అంగీని ధరించాడతడు. మెడలో విచిత్రమైన పూసలదండలు వ్రేలాడుతున్నాయి. ముఖం నిండా ఏదో రంగులు పులమబడి వున్నాయి. తలపై పక్షి ఈకలతో చేయడ్డ టోపీలాంటిది వుంది. తెల్లగా వెండిలా మెరుస్తోన్న నిడుపాటి గడ్డం పిల్లగాలికి మెల్లగా ఎగురుతూంది. ఆ చేతిలో పాములా వంకీలు తిరిగిన నల్లని దండం వుంది.

"జన్మకారణ్ ....!"

విచిత్రంగా కన్పిస్తోన్న ఆ వృద్ధునివంక ఆశ్చర్యంగా కన్నులు విప్పార్చుకొని చూస్తోన్న పిల్లలతో చెప్పారు ఆ ఆదివాసులు.

మైదానం మధ్య నున్నడోలు ప్రక్కనే తక్తా కూడా దింపబడింది.

మారుక్షణం ఏడుసార్లు డోలు ప్రయోగించబడింది. ఆదివాసులంతా జయజయధ్వానాలు చేశారు.

చిమన్ భాయిపటేల్ కూడా గౌరవపూర్వకంగా లేచి నిలబడ్డాడు. అతనితో పాటు అయేషా, మాధవి, కుమార్ లు కూడా లేచి నిలబడి అభివాదం చేశారు.

వారందరి అభివాదాలను స్వీకరిస్తున్నట్లుగా చేతిలోని దండాన్ని పైకెత్తాడు జన్మకారణ్.

నైసర్గికంగా మినీకాయ్ దీవి అంతా దట్టమయిన కీకారణ్యంతో నిండివుంది. కేవలం తూర్పు దిక్కులో మాత్రం నాగరికత కాస్త అభివృద్ధి చెందింది.

దానికి కారణం: మినికాయ్ దీవికి తూర్పున వున్న కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి వలస వచ్చిన ప్రజలు అక్కడ స్థిరనివాసం ఏర్పరచుకోవడం.

అలా వలస వచ్చినవారిలో చిమన్ భాయిపటేల్ ఒకడు.

ఆ కాస్త తూర్పు భాగాన్ని, మినహాయిస్తే, మిగిలిన దీవి అంతా దట్టమయిన అడవీ, కొండలూ, గుట్టలూ, ఇసుకపర్రలూను.

కేరళ అడవులలో కనిపించే చోళ నాయకులు, పణి నాయకులు అనబడే ఆదివాస తెగలను పోలిన....ఒక ఆదిమజాతి ప్రజలు వీరు.

వీరి నివాసం కీకారణ్యం.

వీరి నాయకుడు జన్మకారణ్!

జన్మకారణ్ అన్నది ఒక వ్యక్తి పేరు కాదు. అది వ్యవస్థాగతమైన వ్యావహారిక పదం.

ప్రజలను పాలించేవానిని రాచరిక వ్యవస్థలో రాజు అనీ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రధాని అనీ, ఫెడరల్

వ్యవస్థలో ప్రెసిడెంట్ అనీ యెలా వ్యవహరిస్తామో అలాగే ఆ జాతివారు తమ నాయకుణ్ని జన్మకారణ్ అని మన్నిస్తారు.

నిజానికి చీమన్‌భాయిపటేల్ పేరుకు ఆ దీవికి పెద్ద అయినా, అతని అధికారం చెల్లుబాటు అయేది కేవలం నాగరికంగా అభివృద్ధి చెందిన ఆ తూర్పు భాగం లోనే!

మిగిలిన దీవిలోని ప్రజలంతా జన్మకారణ్ ఆజ్ఞలకు లోబడి వుంటారు.

తలాపై నుండి లేచి నిలబడ్డాడు జన్మకారణ్. తలపై నున్న పక్షి ఈకల కిరీటాన్ని, చేతిలోని దండాన్ని తలాపై వుంచి మెల్లగా ముందుకు నడిచాడు.

డోలు శబ్దం మళ్ళీ మొదలయింది.

ఏడడుగులు ముందుకు నడిచి అక్కడున్న శిలాఫలకం మీద పద్మాసనం వేసుకొని కూర్చున్నాడు అతడు. ఏడుగురు ఆటవిక స్త్రీలు మట్టికుండను పట్టుకొని అతనిచుట్టూ వలయంలా ఏర్పడ్డారు.

డోలు శబ్ద వేగాన్ని పుంజుకుంది.

ఏడుకుండలలో తెచ్చిన సముద్ర జలంతో జన్మకారణ్‌ను అభిషేకించారు ఆ స్త్రీలు.

నీళ్ళోడుతున్న శరీరంతో మెల్లగా లేచి నిలబడ్డాడు అతడు. మరుక్షణం డోలు శబ్దం టక్కున ఆగిపోయింది. చీమ చిటుక్కుమంటే వినిపించేంతటి నిశ్శబ్దం ఆ మైదానాన్ని ఒక్కసారిగా ఆవహించింది.

జన్మకారణ్ యేం చెబుతాడా అని ఊపిరి బిగబట్టి మరీ, ఆత్రంగా యెదురుచూస్తున్నారు ఆ ఆదివాసులు.

అతడు ఒక్కసారి ఆ మైదానం అంతా కలియజూసాడు.

కణ కణ లాడుతున్న నిప్పులున్న కుంపటిని అతడి ముందు వుంచారు. ఏవో వేళ్ళు ఆ నిప్పులపై వేశారు. తెల్లని, ఘాటైన పొగ సుళ్ళు తిరుగుతూ పైకి యెగసింది.

ఆ పొగ అతడిలో యేదో వివశత్వాన్ని కల్గించింది. అతని కన్నులు అరమోడ్పు లయ్యాయి. ఏదో ఆవేశం వచ్చినట్లు అతని శరీరం సన్నగా వణక సాగింది.

“నేసూలూ....!”

ఎలుగెత్తి పిలిచాడతడు.

మైదానం అంచులను దాటి, అడవిలో పైతం ప్రతిధ్వనించింది అతని గొంతు. ఒక లయలా, వెల్లువలా అతని నోటి వెంట మాటలు పెల్లుబుకుతున్నాయి.

“నేసూలూ....!

పున్నమొచ్చింది. మనల్ని గన్న అమ్మోరి జాత రొచ్చింది. ఆడండి! పాడండి!

పెంటి. పెట్టా....ఒట్టు పెట్టి జట్టు పట్టి, ఏరుమీద తేరు కట్టి....

తెప్పమీద తేలిపొండి!

“జోడుకట్టి మరలి రండి!

ఏడు రోజుల జాతర....!

ఏడుకగా జరపాలి! ఏడు రోజుల దనుక....నీట పోకరద్దు! నీట వేట లాద్దు! నీట పుట్టిన జీవిని నోట పెట్టద్దు!

ఎరుకగల మా తల్లి....ఎరుక మీనుంటాది. కట్టు తప్పేరా... నేసూలూ! మట్టిలో కలిసేరు.”

జన్మకారణ్ మాటలు వినే సరికి సల్లగా మాడిపోయింది

ఆయేషా ముఖం.

"అంటే.... ఈ వారంరోజులూ వారు సముద్రపు వేటకు వెళ్ళరా!" ఆశ్చర్యంగా భర్తవంక చూస్తూ అడిగింది ఆమె.

"ఇందులో ఆశ్చర్యం యేముంది ఆయేషా!

ప్రతి ఏటా ఈ అమ్మవారి జాతర జరిగిన మరునాటి నుండి ఏడురోజుల వరకు వారు ఏ జలచరాలనూ ఆహారంగా తీసుకోరు. అది వారి ఆచారం.

అయితే.... నా కర్థం కానిది ఒక్కటే!

ప్రతి ఏటా కార్తీకపౌర్ణమినాడు జరిగే ఈ జాతర.... ఈ ఏడు ఒక నెలరోజులు ముందుగా... అదీ అకస్మాత్తుగా కేవలం ఒక్కరోజు వ్యవధిలో ఇంత ఆదరాబాదరాగా యెందుకు జరుపుతున్నారా అన్నదే నాకు అంతుపట్టటంలేదు" సాలోచనగా తలపంకిస్తూ అన్నాడు పటేల్.

అతడి మాటలకు ఆయేషా భృకుటి ముడివడింది. ఏదో చెప్పలేని అసహనం ఆమె కళ్ళల్లో లీలగా కదలాడింది.

కాని, ఒక్కక్షణంలో తన మనసులోని భావాలను బలవంతంగా అణచుకొని, మామూలుగా చిరునవ్వులు చిందించింది ఆమె.

అయితే, మారుతున్న ఆమె ముఖభావాలు రాంకుమార్ సునిశిత దృష్టిని మాత్రం దాటిపోలేదు.

"జన్మకారణ్ మాటలకు, ఎందుకలా హర్ట్ అయినట్లు చూసింది ఆయేషా?

ఈ ఆదివాసులు ఏడురోజులపాటు జలచరాలను ఆహారంగా తీసుకోకుంటే ఆమెకు ఒనగూడే నష్టం యేమిటి? ఆమె యెందుకలా ముఖాన్ని మాడ్చుకుంది....?"

ఇది కాదు రాంకుమార్ ను కలవర పెడుతున్నది....

"అంత త్వరగా, తృటిలో తన ముఖభావాల్ని మార్చుకో కల్గింది అంటే....ఆమె సాధారణ సంసార స్త్రీ అయి వుండదు. కాకుంటే....ఎవరామె?"—దీర్ఘంగా ఆలోచిస్తోన్నాడు రాంకుమార్.

అనుమానం అన్నది అలాంటివారికి కల్గనే కూడదు. ఒకసారి అనుమానం వచ్చాక దాని అంతు చూడనిదే నిద్రపోరు వారు.

ఆ రోజు రాత్రే త్రివేంద్రంలోని పోలీస్ కమీషనర్ ను కాంటాక్టు చేశాడతడు.

'ఆయేషా పూర్తి వివరాలను, ఆమె పుట్టుపూర్వోత్తరాలను క్షుణ్ణంగా ఎంక్వయిరీ చేసి, రిపోర్టు పంపమని' కమీషనర్ ను కోరాడతడు.

5

నీలి సముద్రపు అలలపై బాణంలా దూసుకుపోతూంది ఆ స్టీమ్ బోట్.

హోరుమని వీస్తున్న గాలికి ఎగురుతున్న ముంగురులను అలవోకగా సర్దుకొంటూ, రాంకుమార్ వంక చూసింది మాధవి.

"మొత్తానికి యెలాగయితేనేం. వారం రోజులపాటు ఈ దీవిలోని ప్రజలు ఏ జలచరాన్నీ ముట్టకుండా చేశావు. రియల్లీ హేట్స్ ఆఫ్ టు యూ....కుమార్!

బట్! ఎలా....?

ఎలా ఆ జన్మకారణ్ ను మేనేజ్ చేశావు?"

—అంతవరకూ గుండెల్లో బిగబట్టుకున్న సందేహాన్ని అతని ముందు కక్కేసింది ఆమె.

స్టీమ్ బోట్ స్టీరింగ్ ను ఏకాగ్రతతో కంట్రోల్

చేస్తున్న రాంకుమార్ చిన్నగా నవ్వాడు.

"నేను ఈ దీవిలో అడుగు పెట్టినప్పటినుండి....అదే ఆలోచిస్తున్నాను మాధవీ! తాత్కాలికంగా పదిరోజుల పాటైనా ఈ దీవి ప్రజలు మత్స్యాహారాన్ని తీసుకోకుండా, వారిని ఆపాలి.

కాని....ఎలా?

ఈ దీవిలోని కొందరు వ్యక్తులను కలిసి....ఎంక్వాయిరీ ప్రారంభించాను.

చివరకు, ఈ జాతర గురించి ఒక వృద్ధుడు చెప్పాడు మాధవీ!

"ఈ జాతర... ముఖ్యంగా ఈ తెగలోని యువతీ, యువకుల వివాహాల కోసం ఉద్దేశింపబడింది. ఈ జాతర జరిగిన మరునాటి నుండి ఏడురోజుల వరకూ, క్రొత్తగా తోడు కట్టిన ఆ యువతీ, యువకులు....జనపథాలలోనికి అడుగు పెట్టరు.

ఆ జంటలు మరలి వచ్చేవరకూ, అంటే, ఏడురోజుల వరకూ వీరు యే జలచరాన్నీ నోట పెట్టరు. తాము జలచరాలను భక్షించరు కాబట్టి, తమ వారిని జలదేవత రక్షిస్తుందనీ, ఏడు రోజుల కామయాత్ర (మన భాషలో చెప్పాలీ అంటే హనీమూన్) తరువాత ఆ జంటలు క్షేమంగా వస్తారని వారి నమ్మకం.

కాని, ఈ జాతర... కార్తీక పౌర్ణమినాడు జరుగుతుంది. అంటే మరో నెలరోజుల తరువాత! '

ఆ జాతరను యిప్పుడు చేయించగలిగితే ..! మరో వారం రోజులవరకూ వారు విషపూరితాలైన జలచరాలను తినకుండా ఆపవచ్చు. వారి ప్రాణాలను రక్షించవచ్చు. మనకు కూడా ఈ ఎసైన్ మెంట్‌ను పూర్తిచేయ

దానికి ఒక వారం రోజులపాటు గడువు దొరుకుతుంది.

కాని....ఎలా?

ఆ జాతరను యిప్పుడు చేయించటం ఎలా? తీవ్రంగా ఆలోచించసాగాను నేను.

అప్పుడు సడన్‌గా తట్టింది నాకు ఒక అద్భుతమైన ఆలోచన!" అన్నాడు రాంకుమార్.

"ఏమిటది?" కుతూహలంగా అడిగింది మాధవి.

ఇక్కడ వీరు ఇలా మాట్లాడుకొంటున్న సమయంలో....అక్కడ....

ఒక కొండ గుహలో....

చర్మపు తల్పాలపై ఎదురెదురుగా కూర్చుని వున్నారు జన్మకారణ్, ఆయేషా!

వారిద్దరి మధ్యా పెద్ద పెద్ద ఇత్తడి పళ్ళెరాలలో వివిధ రకాలైన తినుబండారాలూ, మరో పళ్ళెంలో ఎర్రని సిల్క్ గుడ్డలూ వున్నాయి. అవి ఆయేషా భక్తితో జన్మకారణ్‌కు సమర్పించిన కానుకలు.

ప్రకృతి సహజంగా యేర్పడిన అద్భుతపు గుహ అది. ఆ గుహ లోపలి భాగం తెల్లగా మెరుస్తూంది. గుహ లోపల ఎయిర్ కండిషన్డ్ గదిలా చల్లగా వుంది. గుహ ఉపరితలంలో ఎక్కడ నుండో సూర్యరశ్మి లోనికి ప్రసరిస్తూంది. జన్మకారణ్ నివసించే ఆ గుహను అలియాన్ అని పిలుస్తారు.

"చెప్పండి జన్మకారణ్!

ఏటా కార్తీక పౌర్ణమినాడు చేసే ఈ జాతర, ఈ ఏడు మాత్రం యెందుకు ఒక నెల రోజులు ముందుగా చేశారు?"—అత్యంత వినయాన్ని ఒలకబోస్తూ అడిగింది ఆయేషా!

"దేవర ఆన బిడ్డా!" అన్నాడు జన్మకారణ్ కళ్ళు అరమోడ్చి, భక్తితో ఆకాశంవంక రెండు చేతులనూ చాస్తూ.

అర్థం కానట్టు అతనివంక చూసిందామె.

తెల్లని గుబురు మీసాల మాటున దాక్కున్న అతని పెదవులు చిరు దరహాసంలో విచ్చుకున్నాయి.

"మొన్నటి దినాన....

సూర్యుడు నడినెత్తిన ఉన్నాడు. ఎండ మండి పోతోంది. ఏట స్నానించి, నట్టడివి మధ్యబడి నడిచి వస్తున్నా.

దారిలో, ఓ మద్దిచెట్టు నీడలో పులి చర్మంపై కూర్చున్న ఓ యోగిని చూశాను. కళ్ళు మూసుకొని తపస్సు చేస్తుండాడా సామి.

ఆ సామికి కూసింత దూరంలో ఆరడుగుల నల్లత్రాచు పడగ విప్పి ఆడుతూంది.

నేను ఆ సామి దగ్గరకు నడిసాను. నా అడుగుల సడికి ఆ పాము జరజరా ప్రాకుతుంటూ ప్రక్కనున్న పొదల లోనికి వెళ్ళిపోయింది.

పామేంది, పాదాల ముంగిట పడగవిప్పి ఆడటమేంది అనుకుంటూ అబ్బురపడ్డాను నేను. భక్తితో ఆ సామి పాదాలకు నమస్కరించాను.

"జన్మకారణ్!

భద్రం నాయనా! ఆపద ముంచుకొస్తూంది. కాచుకో! తెలివిగా మసలుకో!" అన్నాడా సామి.

నేను అచ్చెరువున నిచ్చరబోయాను.

మూసిన కళ్ళు తెరవలేదు ఆ సామి, నన్ను పేరుపెట్టి పిలిచిండు. మున్నెన్నడూ నన్ను చూసి ఎరగడు. కాని

నన్ను గురుతు పట్టింది.

అందునా ఆపదని చెప్పేసరికి, నాకు భయం ముంచుకు వచ్చింది.

మహిమగల మా తండ్రి అనుకుంటూ ఆతని ముందు మోకరిల్లాను నేను.

"చెప్పు సామీ!

ఆపదని ఎరుక చెప్పినావు. గట్టెక్కే దారీ నీవే చెప్పాలి" అన్నాను నేను చేతులు జోడించి.

ఆ సామి మెల్లగా కళ్ళు తెరిచాడు. ప్రక్కనున్న కమండలాన్ని తీసి, అందులోని జలాన్ని నేలమీద వంపాడు, ఏదో మంత్రాన్ని జపిస్తూ.... గాలిలో చేతిని ఊపాడు. అంతే! మట్టిలో భగ్గున మంటలు పుట్టుకొచ్చాయి.

కొంత జలాన్ని నా దోసిలిలో పోశాడు. బుస బుసా పొంగుతూ సముద్రపు నురగలా మారిపోయింది—ఆ జలం.

"చూశావా బిడ్డా!

మట్టిలో మంటలు పుడుతున్నాయి. జలం పొంగులు వారుతూంది. అమృతం విషమై పోతూంది. నీ నేస్తులు రోగాలతో మరణిస్తున్నారు.

సత్యమేనా!"

నా కళ్ళల్లోనికి సూటిగా చూశాడా సామి.

నిజమే! ఈ మధ్య మా తెగవారు యేవో చిత్రమైన రోగాలపాలవుతున్నారు. మందేసినా, మాకేసినా మరణిస్తున్నారు.

"మేలుకో బిడ్డా! నీ నేస్తులను కాచుకో!

రేపటిపొద్దున అమ్మోరి జాతర జరిపించు, జలదేవతకు

శాంతి చేయించు.

మేలు జరుగుతుంది.

కీడు తొలగుతుంది" చేయెత్తి దీవిస్తూ అన్నాడా సామి.

ఆ సామి మాట ప్రకారం జాతర జరిపించినా!" చెప్పటం ముగించాడు జన్మకారణ్.

"ఇప్పుడా స్వామి యెక్కడున్నాడు జన్మకారణ్?" ఆత్రంగా అడిగింది ఆయేషా.

తెలియదన్నట్లు పెదవి విరిచాడు అతడు. "ఆ పూట నుండి ఆ సామి అయిపు లేదమ్మా! మహిమగల తండ్రి మాయమై పోయాడు"—కనుపించని యోగికి చేతులెత్తి నమస్కరిస్తూ అన్నాడతడు.

'విద్యా గంధం ఇసుమంతైనా లేని ఈ ఆదివాసులు పరమ మూర్ఖులు. మంత్రాలనూ, మాయలనూ గ్రుడ్డిగా నమ్ముతారు వీరు.

వీరి బలహీనతలను ఆధారంగా తీసుకొని, ఎవరో వీరిని తెలివిగా మోసగించారా? అదే నిజమైతే ఈ జాతర పెల రోజులు ముందుగా జరగటంవలన వారికి వచ్చే లాభం యేమిటి?

తమకు గాని, జన్మకారణ్ కు గాని తెలియకుండా ఒక క్రొత్త యోగి ఈ దీవిలోనికి యెలా అడుగు పెట్టగలిగాడు? మళ్ళీ ఎవరి కంటా పడకుండా ఎలా అదృశ్యమయ్యాడు?

సంథింగ్ ఈజ్ రాంగ్ సమ్ వేర్!

ఎక్కడో, యేదో తన ఊహల కందనిది జరుగుతోంది. బట్ వాట్? యేమిటి? యేమిటి జరుగుతోంది?' దీర్ఘంగా ఆలోచించసాగింది ఆయేషా!

ఇక్కడ.... బోట్‌లో....

జరిగిన కథంతా క్లుప్తంగా చెప్పి, "ఇంతకూ ఆ యోగి ఎవరో అడగరేం మాధవీ!" అన్నాడు రాంకుమార్.

"ఇంకెవరు? మీరే అయివుంటారు" అంది మాధవి చిలిపిగా నవ్వుతూ.

చిరునవ్వుతో తల పంకించాడతడు.

"కాని.... మట్టిలో మంటలు పుట్టటం, నీరు నురగలా మారటం.... యివన్నీ...." సందేహంగా అడిగింది ఆమె.

"దోజ్ ఆర్ చీప్ కెమికల్ ట్రిక్స్ మాధవీ! ముందుగా మట్టిలో పొటాషియం పెర్మాంగనేట్‌ను కలిపి ఉంచాను. కమండలంలోని గ్లిజరిన్‌ను దానిపై చల్లేసరికి మంటలు పుట్టాయి.

మీకు తెలుసో, తెలియదో 1986 సెప్టెంబర్‌లో అనుకుంటాను.... విశాఖలో యోగాశ్రమం కేస్‌ను డీల్ చేశాను. స్వామి యోగానంద సరిగ్గా ఈ రసాయనిక ప్రక్రియతోనే యజ్ఞకుండంలో మంటలు పుట్టించాడు. కాని ప్రజలకు మాత్రం మంత్రాలతోనే మంటలు పుట్టించినట్లు భ్రమను కల్పించాడు.

అదృష్టవశాత్తూ నాకు ఆ ట్రిక్ గుర్తుకు వచ్చి సమయానుకూలంగా వాడుకోగల్గాను.

ఇక రెండవ ట్రిక్....

అతని చేతులలో పోసినది నీరు కాదు. హైడ్రోజన్ పెరాక్సైడ్. చర్మానికి తగిలిన వెంటనే అది స్వభావసిద్ధంగా నురుగులు గ్రక్కింది.

డెట్టాల్!"

"అంటే....ఆ కమండలానికి రెండు అర లున్నాయన్నమాట! ఒక అరలో గ్లిజరిన్, మరో అరలో హైడ్రోజన్ పెరాక్సైడ్ ఉండివుండాలి. ఏమ్ ఐ కరెక్ట్?" అంది మాధవి.

ఆమెవంక మెచ్చుకోలుగా చూశా డతడు.

"అదే ఈ ట్రిక్ లోని ప్రత్యేకత మాధవీ! ఒకే కమండలంలోని నీరు మట్టిలో మంటలను, అర చేతిలో నురుగులను సృష్టించబట్టే, జన్మకారణ్ ను అంత సులువుగా నమ్మించగల్గాను.

అయితే నా పట్ల జన్మకారణ్ కు మరింత నమ్మకాన్ని పెంచినది....ఆ పాము.

థాంక్స్ ఎ లాట్ టు దట్ కోబ్రా."

"అన్నట్లు మరిచేపోయాను సుమా! ఎక్కడిదా పాము కుమార్?" నవ్వుతూ అడిగింది మాధవి.

అతడు స్టయిల్ గా భుజాలను ఎగురవేశాడు.

"ఏమో! ఎలా వచ్చిందో! ఎక్కడ నుండి వచ్చిందో! నా అదృష్టం యేమిటంటే....

సరిగ్గా జన్మకారణ్ వచ్చేసరికి అది నా ముందర పడగ విప్పి ఆడుతుండడం, అతని అడుగుల సవ్వడికి పొదలలోనికి పారిపోవడం....యాదృచ్ఛికం అంటే యిదేనేమో!" అన్నాడు రాంకుమార్.

చేతి వ్రేళ్ళ కొసలతో ఫాలంమీద పడిన ముంగురులను సవరించుకొంటూ అతనివంక ఎడ్మయిరింగ్ గా చూసింది మాధవి.

6

అంతులేని సాగర గర్భంలో చేపల జంటలా, ఈదు

బిగుతైన స్విమ్మింగ్ సూట్లను ధరించారు వారు. కళ్ళతో సహా తల నంతటినీ కవర్ చేస్తున్న వాటర్ ప్రూఫ్ హెల్మెట్స్ పెట్టుకొన్నారు. వీపుల పై బిగింపబడ్డ ఆక్సిజన్ సిలిండర్లు, పాదాలకు చేప తోకల్లాంటి వింతైన బూట్లు....మరో గ్రహంలోనికి అడుగు పెట్టడానికి తయారయిన ఆస్ట్రోనాట్స్‌లా ఉన్నాయి వారి ఆకారాలు.

వాటర్ గన్‌ను చేతితో పట్టుకొని నలుదిక్కులా పరిశీలనగా చూస్తోన్నాడు రాంకుమార్. పవర్ ఫుల్ వాటర్ ప్రూఫ్ కెమెరాతో ఫోటోలు తీస్తోంది మాధవి.

అయితే తాము అన్వేషిస్తున్నది లభ్యం కాలేదన్న నిరుత్సాహం వారి ముఖాలలో దోబూచులాడుతోంది.

'ఇక చాలు. పైకి పోదాం' అన్నట్లు సైగ చేశాడు రాంకుమార్. అంగీకారంగా తలాడించింది ఆమె.

కాళ్ళను చక చకా కదిలిస్తూ నీటి పైకి ఈదడం ప్రారంభించారు వారు.

అంతలో ఒక్కసారిగా నీటిలో కల కలం బయలు దేరింది. అంతవరకూ వారిచుట్టూ అల్లరిగా తిరుగుతున్న అందమైన చిన్న చిన్న చేపలు భయంతో కకావికలై పారిపోయాయి.

ఏం జరిగిందో అర్థంగాక తెల్లబోయి చూస్తోన్నారు వారు. ఏదో భూతం లాంటి ఆకారం శరవేగంగా తమ వైపు దూసుకురావడం లీలగా కనిపించింది వారికి. కేవలం రెండు క్షణాలలో వారిని సమీపించిందా ఆకారం.

గుహ లాంటి నోరు తెరచుకొని, తెల్లని కోరలు సాచి, జల రాక్షసిలా వస్తోన్న పన్నెండు అడుగుల

మాధవి.

వాటర్ గన్ ను ఆ షార్క్ కు ఎయిమ్ చేశాడు రాంకుమార్. కాని గురిపెట్టలేనంత దగ్గరగా వచ్చేసింది అది. మరో క్షణంలో అది తమను ఎటాక్ చేస్తుంది అనగా, ఏం చేయాలో తోచక, చటుక్కున మాధవితో పాటుగా క్రిందకు డైవ్ చేశాడతడు. సరిగ్గా వారి తలల పై నుండి దూసుకుపోయింది అది.

పది గజాలు ముందుకు వెళ్ళాక, గిరుక్కున వెనుతిరిగింది ఆ షార్క్. ఎర పై తన గురి తప్పినందుకు మరింత మండిపడుతూ ముందుకు దూసుకువచ్చింది.

క్రిందకు డైవ్ చేసిన రాంకుమార్ చటుక్కున సర్దుకొని కూర్చున్నాడు. తెల్లని షార్క్ పొట్ట భాగం కనిపించింది అతనికి. అంతే! ట్రిగ్గర్ ను నొక్కాడు.

పన్నెండు అంగుళాల పొడవున్న వాటర్ యారో.... ఆ షార్క్ పొట్టను చీల్చుకొంటూ దూసుకుపోయింది.

భరించలేని బాధతో రెండు క్షణాల పాటు విల విలలాడిపోయింది అంత పెద్ద షార్క్. తెల్లని దాని పొట్ట రక్తసిక్తమై ఎర్రని రంగును సంతరించుకుంది.

భయ విహ్వలరై, బెరుకుగా చూస్తోన్న మాధవిని తీసుకొని, నీటి పైకి పోవడానికి ఉద్యుక్తుడయ్యాడతడు.

నీటిలో కారే రక్తం యెంత ప్రమాదకరమో అతనికి తెలుసు. రక్తం వాసనను పసిగట్టి వందలకొలదీ షార్క్ చేపలు ఒక్కసారిగా గుంపుగా వచ్చి పడతాయి. ఒక్కసారి వాటి కంటబడ్డ ప్రాణి యేదయినా, ఎంత బలమైనదయినా ప్రాణాలతో బయటపడటం కల్ల.

అంతే! తనను దెబ్బతీసిన శత్రువుపై నున్న కసినంతటినీ.... కత్తిగా మార్చుకొని ఒక్క ఉదుటన వారిమీదకు విరుచుకు పడింది ఆ షార్క్.

దెబ్బ తిన్న షార్క్ చాలా ప్రమాదకరమని అతనికి తెలుసు కాని, అది మరీ అంత వేగంగా ఎటాక్ చేస్తుందని ఊహించలేదు అతడు.

అతనికి మరోసారి గన్‌ను పేల్చే అవకాశం లేక పోయింది. ఆ షార్క్ యెంత వేగంగా ఎటాక్ చేసిందంటే, అతడు గన్‌ను ఎయిమ్ చేసేసరికి, కోరలు సాచిన గుహలాంటి దాని నోరు అతని యెదురుగా ప్రత్యక్షం అయ్యింది.

గన్‌ను పేల్చే వ్యవధి లేదు. తప్పించుకొనే మార్గం లేదు. ఆలోచించడానికి అవకాశం లేదు.

ఏం చేయాలో తోచక...తనను నోట కరుచుకోవడానికి తెరిచిన ఆ షార్క్ రెండు దవడల మధ్యా తన చేతిలోని వాటర్ గన్‌ను నిలువుగా జొనిపాడతడు.

అంగుటికి అడ్డంగా వాటర్ గన్ గుచ్చుకోవడంతో, దవడలు మూయలేక పిచ్చెక్కినట్లు చిందులేయసాగింది ఆ షార్క్. ఏదో ప్రళయం సంభవించినట్లు అక్కడి నీరంతా అల్లకల్లోలమయిపోంది.

ఆ షార్క్ వలన తమకు మరే ప్రమాదమూ లేదని తెలిసి, రిలీఫ్‌గా నిట్టూర్చారు వారు.

గుండెల నిండా గాలి పీల్చుకొని పైకి ఈదడం ప్రారంభించారు వారు.

అదే సమయంలో....ఒక పెద్ద షార్క్‌ల గుంపు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టింది. రక్తసిక్తమైన తమ తోటి షార్క్ చుట్టూ ఒక్కసారి ప్రదక్షిణం చేశాయి అవి,

వెంటనే కవాతు చేసినట్లు గిరుక్కున వెనుదిరిగి, కుమార్, మాధవిలను వెన్నాడటం ప్రారంభించాయి.

నీటి ఉపరితలంమీదకు వచ్చాక హాయిగా గాలి పీల్చు కొన్నారు వారు. పది అడుగుల దూరంలో నీటిపై తేలుతున్న తమ స్టీమ్‌బోట్‌ను చూడగానే.... సంతృప్తితో కూడిన చిరునవ్వులతో వారి పెదవులు విచ్చు కున్నాయి.

హుషారుగా రెండు బారలు ముందుకు వేశారు వారు. అంతే! ఎదురుగా కన్పిస్తున్న దృశ్యాన్ని చూసేసరికి వారి పెదవులమీద చిరునవ్వులు అంతరించిపోయాయి.

కొన్ని వందల షార్క్‌లు శరవేగంగా దూసుకువస్తూ వారిని చుట్టుముడుతున్నాయి,

వారు శక్తి నంతటినీ బాహువుల్లోకి తెచ్చుకొని, ఈదటం ప్రారంభించారు. సరిగ్గా మరో రెండు అడు గుల్లో వారు స్టీమ్‌బోట్‌ను సమీపిస్తారనగా, వారిని ఎటాక్ చేశాయి ఆ షార్క్‌లు.

మాధవి కాలి బూటును నోట చిక్కించుకుందొక షార్క్. తన కాలును ఏదో లాగుతున్నట్లు అయ్యేసరికి కవ్వున అరిచింది ఆమె. అదే క్షణంలో ఆమె వీపుమీద నున్న ఆక్సిజన్ సిలిండర్ కున్న గొట్టాన్ని కొరికివేసింది మరో షార్క్.

ఆక్సిజన్ కనెక్షన్ తప్పిపోవటంతో గాలి అందక, ఉక్కిరిబిక్కిరయ్యింది ఆమె.

మాధవి స్థితిని గమనించి, ఒక్క అంగలో ఆమెను సమీపించాడు రాంకుమార్. అదే క్షణంలో ఆమెను ఎటాక్ చేయబోతున్నాయి రెండు సొరచేపలు. ఒక్క క్షణం అతడు ఆలస్యం చేసివుంటే, వాటి వాడి కోరలకు

బలై పోయి వుండేదామె.

రెండు చేతులతో బొమ్మలా ఆమెను ఎత్తి, బోటు లోనికి విసిరేశాడు అతడు. దబ్బాని మూటలా బోట్‌లో పడటంతో బాధగా అరిచింది ఆమె.

అదే క్షణంలో ఆ రెండు షార్క్‌లూ అతడిని ఢీ కొన్నాయి స్విమ్మింగ్ సూట్‌ను చీల్చుకుంటూ, వాడియైన వాటి కోరలు అతడి శరీరంలో దిగబడ్డాయి. మరో షార్క్ అతడి భుజాన్ని రాచుకుంటూ పోయింది. భుజాన్ని యేదో కత్తితో కోసినట్లు అతని చర్మం చీరుకు పోయింది. అతని కాలిబూటును పట్టుకొని లాగసాగింది మరో సొరచేప.

వాటి బారినుండి తప్పించుకోవడానికి విఫలయత్నం చేస్తున్నాడు అతడు.

బోటులో కెల్లకిలా పడ్డ మాధవి మెల్లగా లేచింది. రాంకుమార్ పరిస్థితిని గమనించింది.

అతడు ఆ షార్క్‌లను చేతులతో విదిలించి కొడుతున్నాడు. విదలించిన కొలదీ అవి మరీ మీద పడుతున్నాయి. కోరలతో గాయపరుస్తున్నాయి. గాయాలతో అతని శరీరం రక్తసిక్తమై పోయింది. వాటితో పోరాడి పోరాడి పూర్తిగా అలసిపోయాడతడు.

'ఇంకో రెండు మూడు క్షణాలు. అంతే! అంతటితో తన పని అయిపోతుంది....' అనుకున్నాడతడు నిస్పృహగా.

అంతలో....బోటును స్టార్టు చేసింది మాధవి. దడ దడమని శబ్దం చేస్తూ ఇంజన్ పని చేయటం ప్రారంభించింది. ఒక్కసారిగా వినవచ్చిన ఆ శబ్దానికి భయంతో ఆ షార్క్‌లు తృళ్ళిపడ్డాయి.

ఆ దేసమయంలో రాంకుమార్ వైపు బలమైన తాడును విసిరింది ఆమె. చటుక్కున ఆ తాడును అందుకున్నాడు అతడు.

అంతే! వింటిని విడిచిన బాణంలా దూసుకుపోయింది ఆ బోటు.

బోటుతో పాటుగా తాడును పట్టుకొని వేళాడుతున్న రాంకుమార్ కూడా ఆ ప్రదేశం నుండి దాటిపోయాడు. కొంతదూరం వరకూ అతడిని వెన్నాడిన షార్కులు. ఆ బోటు వేగాన్ని అందుకోలేక వెనక్కు మరలాయి.

ప్రమాద స్థలాన్ని దాటిపోయామని నిశ్చయించుకున్నాక బోటును ఆపి, రాంకుమార్‌ను మెల్లగా బోటులోనికి చేర్చింది ఆమె. బోట్ లోనికి చేరగానే నిస్త్రాణంగా వెనక్కు వాలిపోయాడతడు.

మాధవి సారధ్యంలో ఆ బోట్ మినీకాయ్ దీవుల వైపు శరవేగంగా దూసుకుపోతోంది. ఆలోచనల తేరుపై ఆమె మనసు అంతకన్నా వేగంగా పరుగులు తీస్తోంది.

'తాము ఆ దీవి నలుదిక్కులా సాగర గర్భంలో సైతం క్షుణ్ణంగా పరిశోధించారు. కాని, యెక్కడా అనుమానాస్పదమయిన దేమీ తారసపడలేదు తమకు.

విచిత్రం యేమిటంటే ..

ఆ వైద్యబృందం ప్రయాణించిన బోటు దేనికయితే గుద్దుకొని, వారు మరణించారని చెప్పబడుతూందో, ఆ పగడపు గుట్టలలాంటివేవీ ఆ దీవి పరిసరాలలో సైతం ఎక్కడా కానరాలేదు తమకు.

అంటే....అది ప్రమాదం కాదా?

కాకుంటే....ఆ వైద్యబృందం యెలా మరణించారు?

ఎవరో వారిని బలవంతంగా చంపి వుండాలి.

ఎందుకు?

వారిని చంపాల్సిన అవసరం ఎవరికుంది? ఈ దీవిలోని జలం ఎందుకు విషపూరితం అయ్యిందో పరిశోధించడానికి సిద్ధం అయ్యారు వారు.

వారి పరిశోధనలవలన ఎవరికి నష్టం?' తీవ్రంగా ఆలోచిస్తోంది మాధవి.

'తన అంచనా తప్పు కాకుంటే వారేదో ప్రమాదకరమైన రహస్యాన్ని కనిపెట్టి వుండాలి. అది వారి పెదవి దాటకూడదని వారినీ పృథ్వి నుండే దాటించే కారు శత్రువులు!' అనుకుంది ఆమె బాధగా నిట్టూరుస్తూ.

ఆలోచనల్లో తేలియాడుతున్న ఆమె కరవేగంగా తమ బోటును సమీపిస్తున్న స్టీమ్‌బోట్‌ను గమనించలేదు.

రైఫిల్ రేంజ్‌లోనికి రాగానే, వార్నింగ్ కూడా లేకుండా కాల్పులు ప్రారంభించారు ఆ బోటులోని వ్యక్తులు.

'ఢాం!' అంటూ రైఫిల్స్ మ్రోగటంతో ఉలిక్కిపడి చూసింది ఆమె. కందిరీగలా ఝుంకారం చేస్తూ ఆమె చెవి ప్రక్కనుండి గాలిలో దూసుకుపోయింది ఒక బుల్లెట్.

చటుక్కున తలను క్రిందకు వంచిందామె. బుల్లెట్స్ వర్షపు చినుకుల్లా వారి బోటుపై కురియసాగాయి.

బోటు వేగాన్ని పెంచిందామె. పాములా మెలికలు త్రిప్పుతూ జిగ్, జాగ్ గా బోటును నడపసాగిందామె. కాని, పట్టువదలని విక్రమార్కుడిలా వారి బోటును వెన్నాడుతూనే వుంది ఆ బోటు.

రైఫిల్స్ మ్రోతలకు ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు

రాంకుమార్. లేని ఓపికను తెచ్చుకొని మెల్లగా తలను పైకెత్తి చూశాడు.

శరవేగంగా తమవైపు దూసుకువస్తోన్న శత్రువుల స్పీడ్‌బోట్ కనిపించింది అతనికి. నల్లని దుస్తులను ధరించిన ఇద్దరు వ్యక్తులు డెక్ మీద నిలుచుని రైఫిల్స్‌తో కాల్పులు సాగిస్తున్నారు.

అతడు మెల్లగా క్రిందకు వంగి బోటు అడుగున వున్న స్టెన్‌గన్‌ను పైకి తీశాడు. బోటు అంచుపై రైఫిల్ బారెల్‌ను వుంచి, బోటులో దాక్కొనే సూటిగా వారి వంక గురి చూశాడు. ట్రిగ్గర్ నొక్కాడు.

అంతే!

నిప్పురవ్వలు గుండెను ముక్కలు చేస్తుంటే, కెవ్వుమని కేక వేస్తూ, డెక్‌పై నుండి సముద్రంలోనికి పడిపోయాడొక వ్యక్తి. తన సహచరుని మరణాన్ని కళ్ళారా చూసిన రెండవ వ్యక్తి ఛటాలున డెక్ పై నుండి బోటులోనికి దూకేశాడు.

రాంకుమార్ వంక మెచ్చుకోలుగా చూసింది మాధవి. నీరసంగా నవ్వాడతడు.

వారి చూపుల కలయికలో.... వారి బోటు వేగం రవ్వంత తగ్గింది. ఒక వ్యక్తి మరణించడంతో శత్రువులు వెనుకంజ వేస్తారనుకున్నారు వారు. ఆ అదాటులో ఒక్క క్షణంసేపు నిర్లక్ష్యంగా వున్నారు వారు.

అదే వారు చేసిన తప్పు!

ఆ ఒక్క క్షణాన్ని శత్రువులు సద్వినియోగం చేసుకొన్నారు. టార్పెడోలా దూసుకుంటూ వచ్చి వీరి బోటును తాకింది శత్రువుల బోటు.

అంతే!

ఆ తాకిడికి నిలువుగా చీలిపోయింది వీరి పడవ. ముక్కలయిన ఆ బోటులో నుండి తృళ్ళి....సముద్రంలోని పడ్డారు రాంకుమార్, మాధవి.

ఆ వైద్యబృందం ఎలా మరణించారో అప్పుడు అర్థం అయింది ఆమెకు.

'అంటే....వారి బోటు కూడా తమలాగే....' అనుకొంది ఆమె నీటిలో మునకవేస్తూ.

ఎగిరి నీటిలో ఫ్లాట్‌గా పడటంవలన తల దిమ్మెర పోయిందామెకు. ఏదో చెక్కబల్లతో మోదినట్లు ఆమె శరీరావయవాలు బాధతో మూలిగాయి. ఆక్సిజన్ సిలిండర్ కనెక్షన్‌ను షార్క్ కొరికివేయటంవలన, ఆ గొట్టం ద్వారా సముద్రపు నీరు ఒక్కసారిగా ఆమె ముక్కులోనికి ప్రవేశించి, ఉక్కిరి బిక్కిరయ్యింది ఆమె.

అదే క్షణంలో....పది అడుగుల పొడవున్న పెద్ద చేప ఒకటి నోరు తెరచుకొంటూ ఆమెను సమీపించింది.

అంతే!

భయంతో చిన్నగా కేక వేస్తూ మూర్ఛ పోయిందామె.

7

బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ కళ్ళు తెరిచిన రాంకుమార్ ఆశ్చర్యంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు.

తాను వున్నది సాగర గర్భంలో కాదు. తన శరీరాన్ని యే పిరానాలూ, షార్క్‌లూ కొరికి తింటూండటం లేదు. అందంగా, విశాలంగా ఉన్న ఒక గదిలో.... మెత్తని కుషన్ బెడ్‌పై హాయిగా పడుకొని వున్నాడతడు.

జరిగిన సంఘటనను గుర్తుకు తెచ్చుకోడానికి ప్రయత్నించా డతడు.

శత్రువుల బోటు తమ బోటును ఢీకొన్న వెంటనే తృళ్ళిపడ్డాడు అతడు. ఆ అదటుకు అతని తల బోటు అంచుకు తగిలింది. కళ్ళ ముందు వేయి మెరుపులు ఒకే సారి మెరిసినట్లనిపించింది అతనికి.

నల్లని చీకటి పరదా లేవో తన కళ్ళ ముందు జారి పడుతుంటే, బోటులో నుండి జారి, సముద్రంలోనికి పడటం మా తం.... లీలగా గుర్తుంది అతనికి.

'అంతే! ఆ తరువాత యేం జరిగింది?

సముద్ర గర్భంలో నుండి ఈ గదిలోనికి ఎలా వచ్చాడు తను?

ఎవరు? ఎవరు తనను రక్షించారు?'

అతని మనసులో సముద్రపు కెరటాల్లా ఎగిసిపడుతున్న ప్రశ్న అన్నింటికీ సమాధానంగా ఆ గది తలుపులు తెరుచుకున్నాయి.

ఆ గదిలోకిని ప్రవేశించిన అందమయిన యువతిని చూసి ఆశ్చర్యంతో నోరు తెరిచాడతడు.

ఆమె.... ఆయేషా!

"మీరా!" అన్నాడతడు ఆశ్చర్యంగా.

చిన్నగా నవ్విందామె.

వయ్యారంగా నడుస్తూ అతడు పడుకున్న బెడ్ ను సమీపించింది.

"బోట్ ప్రమాదంలో చిక్కుకున్న మిమ్మల్ని చూసి, మా మనుషులు రక్షించి యిక్కడకు తీసుకువచ్చారు కుమార్!"—అతని ప్రక్కలో.... ఆ పక్కపై చనువుగా కూర్చుంటూ అంది ఆయేషా.

"మరి....మాధవి?" అడిగాడతడు ఆత్రంగా బెడ్ మీద నుండి లేవడానికి ప్రయత్నిస్తూ.

"డోంట్ గెట్ అప్ ఫ్రం ద బెడ్ కుమార్! ఇంకో ఇరవై నాల్గు గంటల వరకూ, నిన్ను బెడ్ మీద నుండి లేవద్దన్నారు డాక్టర్" అంది ఆయేషా అతని భుజాలపై చేతులుంచి, సున్నితంగా వెనక్కు తోస్తూ.

మెత్తని ఆమె పయోధరాలు సుతిమెత్తగా అతని గుండెలకు హత్తుకున్నాయి. అతని కళ్ళల్లో కళ్ళు పెట్టి చిలిపిగా నవ్విందామె.

"మాధవి కనిపించటంలేదు కుమార్! ఆమె కోసం మా మనుషులు తీవ్రంగా గాలిస్తున్నారు."

ఆమె మాటలకు హతాశుడయ్యాడతడు.

"మాధవి ఏమయింది?

సముద్ర ప్రవాహంలో పడి, యింకో తీరానికి కొట్టుకు పోయిందా? లేక....ఏ షార్క్ దృష్టిలోనో పడి...."
ఆ తరువాత ఆలోచించలేక పోయాడతడు!

ఆ ఆలోచన రావటంతోనే చేదుగా మారిపోయింది అతని నోరు.

"ఏమిటంత తీవ్రంగా ఆలోచిస్తున్నావు కుమార్!" అంది ఆయేషా అతనిపై మరింత వాలుతూ.

ఇద్దరి మధ్యా యిమడలేక ఆమె ఎద పొంగులు బాధగా మూలిగాయి.

పెదవులతో సున్నితంగా అతని బుగ్గలపై రాస్తూ మత్తుగా మూల్గిందామె. అలా ఆమె శరీరం అతన్ని పెనవేసుకోసాగింది.

ఆమె కళ్ళలోని కోరికను ఏ నాడో గమనించా

ఊహించలేదతడు.

ఓ వంక తన మేనకోడలు మాధవి కనిపించటం లేదని చెబుతూనే, ఆమె ప్రతిఘటిందో లేదో కూడా తెలియని ఈ స్థితిలో కూడా....నిస్సంకోచంగా పరాయి మగాడి కౌగిలిలో కరిగిపోవడానికి సిద్ధమౌతున్నదీ అంటే.... ఈమె మామూలు ఆడదేనా?

అంతుపట్టని ఆ దీవి రహస్యానికీ, ఆయేషాకు మధ్య యేదో సంబంధం వుందని అనిపించింది అతనికి.

'ఏది ఏమయినా ఈ చిక్కు ముడులన్నీ విప్పాలంటే, ఆయేషాకు మరింత దగ్గరవ్వాలి, ఆమెను గుంతోష పెట్టాలి, ఆమెను నమ్మించాలి' అనుకున్నాడతడు ఆమె నైటీ హుక్స్‌ను తప్పిస్తూ.

అదే సమయంలో....

చల్లని గాలి హాయిగా ముఖానికి తగులుతూండటంతో మెల్లగా కళ్ళు తెరిచింది మాధవి.

తను ఎక్కడుందో, యెలా వుందో తెలిసేసరికి భయమూ, విస్మయమూ ఒకే క్షణంలో ఆవరించుకున్నాయామెను.

నీలి సముద్రపు అలలపై బాణంలా దూసుకుపోతూంది పది అడుగుల పొడవున్న పెద్ద చేప. సరిగ్గా దాని మూపురంపై వెల్లకిలా పడుకొని వుంది ఆమె.

ఒక్క క్షణం కంగారుపడిందామె.

కాని పరీక్షగా ఆ మత్స్యాన్ని చూశాక, అది డాల్ఫిన్ అని పోల్చాక ఆమె మనసు ప్రమితపడింది.

సాగర గర్భంలో తను మూర్ఛపోయింది ఆ మత్స్యాన్ని చూసే అనీ, తెలివి తప్పిన తనను ఆ మీనమే

ఆ డాల్ఫిన్ మెడను చేతులతో నిమిరింది ఆమె.

డాల్ఫిన్స్ స్నేహజీవులనీ, ఎన్నో సందర్భాలలో, ఎందరో మనుషులను అవి ప్రమాదాల నుండి కాపాడా యనీ పుస్తకాలలో చదువుకుంది ఆమె.

కాని నిజ జీవితంలో....తననే ఒక డాల్ఫిన్ ప్రమాదం నుండి కాపాడటం, దాని మూపురంపై కూర్చుని జలకన్యలా సాగరయానం చేయటం....నిజంగా చెప్పలేనంత థ్రిల్లింగ్ గా ఉంది ఆమెకు.

సముద్రతీరం యింకా పది, పదిహేను గజాల దూరం ఉంటుందనగా, మాధవిని క్రిందకు దింపింది ఆ డాల్ఫిన్. అక్కడ నీరు మొలలోతు వుంటుంది. అంతే!

నీటిలో నిలబడ్డ మాధవిని రాచుకుంటూ, ఆమె చుట్టూ మూడుసార్లు రౌండ్స్ కొట్టింది ఆ డాల్ఫిన్. మరోసారి ప్రేమగా ఆ మత్స్యాన్ని కౌగలించుకొంది ఆమె.

చెంగున ఎగిరి డైవ్ చేసి, అనంతమైన సాగరంలో ఈదుకుంటూ పోతున్న ఆ డాల్ఫిన్ ను చూస్తుంటే, అత్యంత ఆత్మీయుడైన చిరకాల మిత్రు డెవరో విడిచి వెళ్ళిపోతున్నట్లుగా బాధతో మూల్గింది ఆమె హృదయం.

ఆమెకు తెలియకుండానే రెండు కన్నీటిబొట్లు ఆమె కనుకొనల నుండి రాలిపడ్డాయి.

కనుమరుగయ్యేంతవరకూ, ఆ డాల్ఫిన్ వంకే చూస్తూ అక్కడే నిలుచుండిపోయిందామె. తరువాత మెల్లగా కాళ్ళీడ్చుకుంటూ తీరంవైపు నడిచింది.

ఒడ్డుపై అడుగు పెడుతూనే, ఉలిక్కిపడిందామె.

[illegible]

తీరం వెంబడి వ్యాపించిన అడవిలో, చెట్ల చాటు నుండి అస్పష్టంగా కన్పిస్తున్నాయి కొన్ని గూడారాలు....

అవి ఆదివాసుల గుడిసెలు కావు. నాగరికులు నివసించే కాన్వాస్ గూడారాలు.

తాను చేరింది తూర్పుతీరం కాదనీ, పశ్చిమతీరం అనీ ఆమెకు తెలుసు. కానీ, నాగరికులు సంచరించని ఆ పశ్చిమ దిక్కులోనికి ఆ గూడారాలెలా వచ్చాయి.

అడుగుల చప్పుడు కాకుండా ఆ తోపును సమీపించింది ఆమె. చెట్ల చాటునుండి ఆ గూడారాల వంక చూసింది.

అవి మిలటరీ గూడారాల్లా వున్నాయి. వాటి మధ్య కాంప్ ఫైర్ వెలుగుతూ వుంది.

ఇండియన్ కోస్టల్ గార్డ్సు యిక్కడ కాంప్ వేసి వుంటారనుకొంది ఆమె. తూర్పుతీరం చేరడానికి వారి సహాయం కోరాలి అనుకుందామె ఆ గూడారాలవైపు అడుగు వేయబోతూ.

అంతలో....ఒక గుడారంలో నుండి ఇద్దరు సైనికులు బయటకు వచ్చారు.

వారివంక అనుమానంగా చూసింది ఆమె. ఎందుకో వారిని చూస్తుంటే ఇండియన్ సోల్జర్స్‌లా అనిపించలేదు ఆమెకు.

కాంప్ ఫైర్ దగ్గరకు వచ్చారు వారు ఏదో మాట్లాడుకొంటూ. ప్రక్కనున్న కెటిల్ నుండి, రెండు మగ్గులలో టీని వంపుకున్నారు.

కాంప్ ఫైర్ వెలుగులో వారి భుజాలపై నున్న నక్ష

అంతే! ఆమె ముఖం నల్లగా మాడిపోయింది.

అర్ధచంద్రునిపై నక్షత్రపు గుర్తున్న ఎంబ్లమ్ ధరించే దళం భారత దేశంలోని చిన్న పిల్లలకు సైతం తెలుసు.

"పాకిస్తానీస్ ..!" అస్పష్టంగా తనలో తానే గొణుక్కుంది ఆమె.

"భారత భూభాగమైన మినీకాయ్ దీవుల్లో సంచరించాల్సిన అవసరం పాకిస్తాన్ సోల్జర్స్‌కు ఏముంది? ఏమిటి చేస్తున్నారు వారక్కడ?"

కుతూహలం పట్టలేక, చెట్లను చాటు చేసుకుంటూ మరి కొంతదూరం ముందుకు నడిచింది ఆమె.

అక్కడ....కొన్ని గజాల మేర అంతా కొట్టివేయబడి, నేలంతా చదును చేయబడి వుంది. ఆ ప్రదేశం చుట్టూ పెద్ద పెద్ద గోతులను తవ్వుతున్నారు కొందరు సైనికులు.

"మై గాడ్! వీరి ప్రయత్నాన్ని చూస్తోంటే, ఒక సైనిక స్థావరాన్ని నిర్మించేట్లున్నారు!" అనుకుంది ఆమె కలవరంగా వారివంక చూస్తూ.

ఇక ఆ ప్రదేశంలో వుండి, శోధించాల్సినది ఏదీ లేదనిపించింది ఆమెకు. వెంటనే తాత్సారం చేయకుండా పిల్లిలా అడుగులు వేసుకొంటూ వెనుతిరిగింది ఆమె.

అయితే అంతటితో ఆమె అదృష్టదేవత ముఖాన్ని చాటు వేసింది. మూడడుగులు కూడా వేయకుండానే, ఆ సైనికుల కంట పడిందామె.

అడవిలో ఒంటరిగా సాక్షాత్కరించిన ఆడపిల్లను

చూసేసరికి, ఆశ్చర్యంతో చింకి పాటంత అయింది ఆ సైనికుని ముఖం.

"ఎవరు? ఎవరది? ఆ చెట్ల వెనుక?" అంటూ అరిచాడతడు.

అంతే! భయ విహ్వలయై వారివంక చూసిందామె. ఆడగాలి కోసం అలమటించిపోయే ఆ సైనికుల చేతికి చిక్కితే జరిగేదేమిటో ఆమెకు బాగా తెలుసు.

మరుక్షణం కళ్ళెం విడిచిన గుర్రంలా పరుగుతీయడం ప్రారంభించింది ఆమె.

బిగుతైన స్విమ్మింగ్ సూట్‌లో నుండి ఊరి కొస్తున్నట్లు కనిపిస్తోన్న ఆమె యవ్వన సంపదల వంక ఆశగా చూస్తూ లొట్టలు వేసుకుంటూ.... ఆమెను వెన్నాడసాగారు ఆ సైనికులు.

8

బీప్ బీప్ మంటూ శబ్దం చేస్తూ ఆ గదిలోని ఎర్రని బల్బు మూడుసార్లు వెలుగుతూ ఆరింది.

రాంకుమార్ గుండెలపై తలవాల్చి హాయిగా పడుకొనివున్న ఆయేషా ఆ శబ్దానికి ఉలిక్కిపడి లేచింది. ఛటుక్కున మంచం దిగింది. నైటీని సర్దుకొని, వడివడిగా అడుగులు వేసుకొంటూ ఆ గది బయటకు నడిచింది.

ఆమె ప్రవర్తనకు ఆశ్చర్యపడుతూ రాంకుమార్ కూడా మంచం నుండి క్రిందకు దిగాడు.

"ఏం జరిగింది? ఆయేషా యెందుకంత కంగారుగా బయటకు వెళ్ళింది?" ఆలోచిస్తున్నాడతడు

అంతలో గది బయట యెవరివో మాటలు వినిపించాయి అతనికి. పిల్లిలా అడుగులు వేస్తూ ద్వారంవైపు

నడిచాడతడు. మూసివున్న తలుపు వెనుక నిలబడి కీ హోల్ నుండి బయటకు చూశాడు.

వరండాలో ఆయేషా ఎదురుగా నల్లని దుస్తులను ధరించిన వ్యక్తి ఒకడు నిలబడి వున్నాడు.

"మేడం!

దయాక్సిన్ కలిపిన మట్టి ఇరవై డ్రమ్ములలో ఈ రాత్రికే...." అంటూ వినయంగా ఏదో చెప్పబోతున్నాడతడు.

అంతే. ఛెళ్ళున అతని చెంప పేలిపోయింది.

"షట్ యువర్ అగ్లీ మౌత్! ఎక్కడ ఏది మాట్లాడాలో కూడా తెలియదు. డర్టీ రాస్కెల్!" కోపంతో మండిపడుతూ అంది ఆయేషా.

"ఆ చెప్పాల్సిందేదో నా గదిలోనికి వచ్చి ఏడు" విసవిసా నడుచుకొంటూ వెళ్ళిపోతూ అంది ఆమె.

అక్కడ చెబితే తప్పేమిటో, ఆయేషా కొచ్చిన ముప్పేమిటో అర్థంకాక తెల్లబోతూ చూశాడా అనుచరుడు.

ఆ అనుచరునివంక పరీక్షగా చూశాడు శాంతకుమార్.

'సముద్రంలో తమపై దాడి చేసిన వ్యక్తులు కూడా సరిగ్గా ఈ అనుచరుని లాంటి నల్లని దుస్తులనే ధరించారు. అంటే....ఆయేషా మనుషులే తమను చంపడానికి ప్రయత్నించారా?

దవడ పగలగొట్టి మరీ ఆపాల్సినంత రహస్యం ఆ అనుచరుని మాటల్లో ఏముంది?'

అతడు మరోసారి ఆ అనుచరుని మాటలను మననం చేసుకొన్నాడు.

'దయాక్సిన్ కలిపిన మట్టి ఇరవై డ్రమ్ములలో ఈ

రాత్రికే....'

ఏమిటి ఆ మాటలలోని రహస్యం?

అందులో.... 'డయాక్సిన్' అన్న మాటను ఎక్కడో విన్నట్లు అనిపించసాగింది అతనికి. తీవ్రంగా ఆలోచించసాగాడతను. సరిగ్గా రెండు క్షణాల తరువాత గుర్తు వచ్చింది అతనికి ఆ మాటను ఎక్కడ విన్నాడో.

జ్ఞాపకాల తెరను తొలగించుకొని ఒకరోజు ముందుకు వెళ్ళాడతడు.

బోటు ప్రమాదంలో చిక్కుకోక ముందు.

ఆ రోజు....

వారి బోటు మినీకాయ్ దీవులకు పశ్చిమ దిశలో ప్రయాణిస్తూంది. అప్పటికే మిగిలిన మూడు దిక్కుల లోనూ వారి అన్వేషణ పూర్తయింది.

"మాధవీ!

"ఈ దిక్కును కూడా కవర్ చేసేస్తే, మన అన్వేషణ పూర్తయినట్లే. ఇంతవరకూ కాడ్మియం లాంటి లోహాలేవీ మనకు ట్రేస్ కాలేదు. అంటే మనం అనుమానిస్తున్న యీ ఒక్క ఆధారమూ మట్టికొట్టుకు పోయినట్లే!

మరి ఈ జల కాలుష్యం ఎలా సంభవిస్తూంది?"— బోటును నడుపుతూ అన్నాడతను.

"అదే నేనూ ఆలోచిస్తున్నాను కుమార్!

ప్రస్తుతం దేశంలో మిక్కిలి కాలుష్యమైన నగరం బొంబాయి.

ప్రతిరోజూ 268 టన్నుల కార్బన్ మోనాక్సైడ్, 4- టన్నుల సల్ఫర్ డయాక్సైడ్, 27 టన్నుల నైట్రోజన్ ఆక్సైడ్, 37 టన్నుల హైడ్రోకార్బన్‌లు, 30

టన్నుల యితర రసాయన పదార్థాలు వాతావరణం లోనికి చేరుకొంటున్నాయి.

విషపూరితాలైన ఇన్ని రసాయన పదార్థాలు కలుస్తున్నా, బొంబాయి సాగరతీరం, మినికాయ్ దీవు అంతగా కాలుష్యం కాలేదు. అక్కడ లభిస్తున్న చేపలు ఈ దీవి చేపలంతగా విషతుల్యం కాలేదు.

అంటే.... బొంబాయిలో కంటే విషపూరితాలైన రసాయనాలేవో ఈ దీవి జలాలలో కలుస్తూ వుండాలి. ఆ అనుమానంతోనే నిన్న రాత్రి ఈ సాగర జలాలను మరోసారి పరీక్షించి చూశాను కుమార్.

ఒక కొత్త రసాయనం యొక్క లక్షణాలు కొన్ని ఈ జలాలలో లభ్యమయ్యాయి నాకు. నా అనుమానం నిజమైతే అది అత్యంత ప్రమాదకరమయిన రసాయనం.

ఆఫ్‌కోర్స్! ఐ కాంట్ బి ష్యూర్ ఆఫ్ దట్! ఇక్కడున్న కొద్దిపాటి ఎక్విప్‌మెంట్‌తో.... ఆ లక్షణాలు ఆ రసాయనానివేనా లేక కానా అన్నది నిర్ధారించలేకపోయాను నేను.

అందుకే, నా అనుమానాన్ని క్లియర్ చేసుకొనేందుకు, కొంత జలాన్ని, దానితో పాటుగా నేను కను గొన్న లక్షణాలను విపులీకరిస్తూ వ్రాయబడ్డ రిపోర్టును త్రివేంద్రంకు పంపించాను.

బహుశా! ఈ రోజు సాయంత్రానికి అక్కడ నుండి రిపోర్టు రావచ్చు" అంది ఆమె.

"అంత ప్రమాదకరమైన ఆ రసాయనం యేమిటి మాధవీ?" కుతూహలంగా అడిగాడతడు.

"డ... యా...క్సి...న్"—ఒక్కొక్క అక్షరాన్ని వత్తి పలుకుతూ అంది ఆమె.

"డయాక్సిన్?"—అర్థం కానట్లు చూశాడతడు.

చిన్నగా నవ్వి, చెప్పడం ప్రారంభించింది ఆమె. ఆమె చెబుతున్న ఒక్కొక్క మాట వింటున్న కొద్దీ ఒంటిమీద చీమలూ, జెర్రులూ ప్రాకుతున్నట్లు అనిపించ సాగింది అతనికి.

"అణుపాతరాల్లో ఉత్పత్తి అయ్యే రేడియో ఏక్టివ్ విసర్జిత పదార్థాలలో డయాక్సిన్ ఒకటి. అత్యంత ప్రమాదకరమయిన ఈ రసాయనం సముద్రంలో చేరితే సముద్రపు నీటితో పాటు వాతావరణం కూడా కలుషితం అవుతుంది.

సముద్ర జీవులను, సముద్ర సంపదను విషతుల్యం చేసి యావత్ సముద్రాన్ని మృత్యుకూపంగా మారుస్తుంది ఈ రసాయనం.

అన్ని విషాలనూ సముద్రం హరించుకోగలదు అనే విశ్వాసంతో లక్షలు, కోట్ల టన్నుల పరిమాణంలో రకరకాల రసాయనాలు, మలమూత్రాలను సముద్రంలో కలిపేస్తున్నారు. ఇప్పటికే వాటిని మింగిన చేపల ద్వారా చిత్ర, విచిత్రమయిన కొత్త రోగాలు మనిషికి వ్యాపించి, మృత్యువును గొనితెస్తున్నాయి"—చెప్పటం ఆపి బాధగా నిట్టూర్చిందామె.

"డయాక్సిన్ లాంటి అణుపాతర విసర్జిత పదార్థాలు కూడా సముద్రంలో కలుపబడుతుంటాయా!" ఆశ్చర్యంగా అడిగాడతడు.

అవునన్నట్లుగా తల పంకించింది ఆమె.

"విష సదృశమైన రసాయనాలను రహస్యంగా నౌకల్లో రవాణా చేసి, మరో దేశంలో ఎవరికీ తెలియకుండా పారవేసి రావటం లాంటి సంఘటనలు ఇటీవల

ఎక్కువగా జరుగుతున్నాయి.

యూరప్ దేశాల్లో అలాంటి విషపదార్థాలు మూడు కోట్ల టన్నుల వరకూ ఉత్పత్తి అవుతున్నాయి. అందులో కేవలం పదిలక్షల టన్నుల విషపదార్థాలు మాత్రం తూర్పు జర్మనీకి రవాణా అవుతాయి. ఆ పదార్థాన్ని అక్కడ నిర్వీర్యం చేసి ఎవరికీ ప్రమాదం కలగకుండా జాగ్రత్తపడతారు.

మిగిలిన రెండుకోట్ల తొంభయి లక్షల టన్నులు ఎక్కడెక్కడికో రహస్యంగా రవాణా చేసి, ఆ యా దేశాల వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారనేది బహిరంగ రహస్యం

ఇలాంటి రహస్యం యిటీవల జరిగిన ఒక ఓడ ప్రమాదంలో బయటపడింది.

1984 ఆగష్టులో....

బ్రిటీష్ నౌక ఓ.ఎవ్ బ్రిటానియా, ఫ్రెంచ్ నౌక మాంట్ లూయీ ఢీకొన్నాయి. బెల్జియం సముద్ర తీరంలో జరిగిన ఆ ప్రమాదంలో ప్రాణ హాని జరగలేదు. కాని, 'ఫ్రెంచ్ నౌక మాంట్ లూయీలో 41 డ్రమ్ముల డయాక్సిన్ కలిసిన మట్టి కనుగొనబడింది. ఇటలీలోని ఓ అణుసాగరం నుండి ఆ పదార్థం రహస్యంగా ఫ్రాన్స్‌లోని ఓ ప్రాంతానికి రవాణా అవుతూందని....తరువాత బయటపడింది."

—అంతే!

జ్ఞాపకాల తెరలలో నుండి ఉలిక్కిపడి లేచాడతడు....

'డయాక్సిన్ కలిసిన మట్టి యిరవై డ్రమ్ములతో యీ రాత్రికే అంటే యేమిటో అప్పుడర్థం అయింది

అతనికి.

'అంటే....యిక్కడ, మినీకాయ్ దీవి ప్రాంతాలలో అరేబియా సముద్రంలో కూడా అణువిసర్జిత పదార్థాలు కలుపబడుతున్నాయన్న మాట!

అందులో భాగంగా ఇరవై డ్రమ్ములతో డయాక్సిన్ కలిసిన మట్టి ఈ రాత్రికే యిక్కడకు చేరుకుంటుంది.

ఏ దేశం యీ దారుణకృత్యానికి పాల్పడుతోంది?'- అతడు ఒక్క క్షణం పాటు ఆలోచించాడు.

నైసర్గికంగా చూస్తే, అరేబియా సముద్రాన్ని వినియోగించుకోగల అవకాశం ఒక్క దక్షిణ, ఆగ్నేయ ఆసియా దేశాలకు మాత్రమే వుంది.

అంటే....శ్రీలంక, గల్ఫ దేశాలూ, అఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్....

పాక్ అణుశాస్త్రజ్ఞుడు డాక్టర్ అబ్దుల్ ఖాదిర్ ఖాన్—తమ దేశం అణుబాంబును తయారుచేసిందంటూ యిచ్చిన పేపర్ స్టేట్‌మెంట్ గుర్తుకు వచ్చింది అతనికి.

యస్! సందేహంలేదు. ఇది పాకిస్తాన్ పనే! వారే తమ అణుసాధనంలోని విసర్జిత పదార్థాలను అరేబియన్ సీలో డంప్ చేస్తూ ఉండాలి!'

అంతటితో అతని ఆలోచనలు అంతరించిపోయాయి. పట్టలేని ఆవేశంతో అతని రక్తం సలసలా మరిగిపోయింది.

విసురుగా తలుపును తెరచి, బయటకు అడుగుపెట్టాడతడు.

ఆ గది బయట స్టెన్ గన్ను ధరించిన దృఢకాయుడొకడు కాపలా ఉన్నాడనీ, తాను పారిపోవడానికి

ప్రయత్నిస్తే నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపుతాడనీ ఆ ఆవేశంలో రాంకుమార్ మరచిపోయాడు.

అయితే, ఆ వృద్ధ కాయుడు రాంకుమార్ గుండెలకు గన్ను గురిపెట్టలేదు. చూడరానిది యేదో చూసినట్లు, ఆశ్చర్యంతో 'ఓ!' అంటూ చిన్నగా అరిచాడు అతడు.

రాంకుమార్ లాంటి ప్రొఫెషనల్స్‌కు ఆ మాత్రం వ్యవధి చాలు. అతని కుడిచేయి ఫ్లాష్‌లా లేచి ఆ వృద్ధ కాయుని మెడకు కనెక్ట్ అయింది. అంతే! కట్టెలా బిగుసుకుపోయి, దఢాలంటూ నేలమీద పడిపోయాడతడు.

జూడో, కరాటే ఆకిడో లాంటి మార్షల్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యం ఉన్నవారు మాత్రమే ఉపయోగించగల పారలైజింగ్ స్ట్రోక్ అది. ఆ స్ట్రోక్ తగిలిన వారు మరో పన్నెండు గంటలదాకా స్పృహలోనికి రారని అతనికి తెలుసు.

అడ్డుగా పడివున్న అతడిని దాటుకుంటూ, ముందుకు అడుగు వేయబోయి, ఇంతకూ ఆ వృద్ధ కాయుడు తనను చూసి యెందుకంతగా ఆశ్చర్యపోయినట్టూ అని, అనుమానం వచ్చి, ఒక్కసారి తన శరీరం వంక చూసుకున్నాడతడు.

అంతే!

'ఓ' అంటూ అతడు కూడా చిన్నగా అరిచాడు. సిగ్గుతో అతని ముఖం ఎర్రబారింది.

అతడు పూర్తిగా నగ్నంగా ఉన్నాడు.

9

పరుగెత్తి, పరుగెత్తి.. పూర్తిగా అలసిపోయిందామె. ఆయాసంతో ఆమె గుండెలు ఎగిసిపడుతున్నాయి. దాహంతో నాలుక పిడచగట్టుకుపోతూంది ముళ్ళపొదలు

గీచుకొని శరీరం మంటలు పెడుతూంది.

ఆమెకు తెలిసిపోయింది. ఇక తానెంతోసేపు పరుగెత్తలేనని....యింకో పది అడుగులు అంతే! అంతటితో తనలోని శక్తి హరించుకుపోతుంది.

'పిశాచాల్లా వెంటాడుతున్న ఆ పాక్ సైనికుల చేతుల్లో తను బలికావాల్సిందే!' నిస్పృహగా అనుకుంది ఆమె.

పాక్ సైనికుల అడుగుల చప్పుడు మరింత దగ్గరగా వినిపించటంతో భయంతో చిగురుటాకులా వణికిపోయింది ఆమె.

యింకో పది అడుగుల్లో వారామెను సమీపిస్తారనగా....

ఛటుక్కున ఆమె నెవరో జబ్బ పట్టుకొని ప్రక్కనున్న పొదలోనికి లాగారు. భయంతో కెవ్వుమని అరవబోయిందామె. కాని, కటాలున అరచేతితో ఆమె నోరును మూసాడతడు.

ఆశ్చర్యంగా అతనివంక చూసిందామె.

అతడు ఆదివాస యువకుడు. కండలు తిరిగిన దేహంతో బలిష్టంగా ఉన్నాడతడు.

'పులి నోటిలోనుండి సింహం నోటిలోనికి పడలేదు కదా తను' అనుకుంది ఆమె. అతని వంక సంశయంగా చూస్తూ.

"భయపొందకు దొరసానీ! పెరవారం గాముతే! శేఖూల మే!" — ఆమె చెవిలో గుస, గుసలాడుతున్నట్లుగా మెల్లగా అన్నాడతడు.

దాదాపు అతనిని అనుకుంటూ అర్ధనగ్నంగా కన్పిస్తున్న తన శరీరం వంక ఇబ్బందిగా చూసుకుంది ఆమె.

కాని ఆ పొదలోకి ఓ మూల ఒద్దికగా కూర్చుని, తన వంక సిగ్గుగా చూస్తున్న ఆదివాసు యువతిని చూసేసరికి ఆమె సంశయాలన్నీ పటాపంచలై పోయాయి.

ఆ పొద వంక అప్పుడు చూసిందామె పరిశీలనగా. సూర్యరశ్మికూడా సోకనంత దట్టంగా వ్యాపించిన ఆ పొదలోపల....ఓ మూల ఆకులూ, పూవులూ మెత్తని పరుపులా పరచబడి ఉన్నాయి. ఆ పూల పక్కమీదే ఆ ఆదివాస యువతి కూర్చుని వుంది.

ఓ ప్రక్క గుట్టగా వేసుద్ద ఏవో పళ్ళూ, సొరకాయ బుర్రతో నీళ్ళూ వున్నాయి.

వారినీ, ఆ ఏర్పాట్లనూ చూసి, వారు పున్నమినాడు క్రొత్తగా జోడుకట్టిన జంట అనీ, ప్రస్తుతం (హనీమూన్ ట్రిప్) కాము యాత్రలో ఉన్నారని గ్రహించింది మాధవి.

ఆ తరువాత..

ఆకులో ఆకులై, క్రొమ్మలో క్రొమ్మలై ఆ అడవిలో మసలే ఆ ఆదివాసుల సాయంతో, ఆ సైనికుల కంటబడకుంటా ఆ అడవిని దాటటం పెద్దకష్టం కాలేదామెకు.

ఆ దేసమయంలో...

త్రివేంద్రంలోని తన కార్యాలయంలో కాలుకాలిన పిల్లిలా అటూ, ఇటూ తిరుగుతున్నాడు పోలీస్ కమీషనర్.

అతని టేబిల్ పై రెండు కాగితాలు పరచబడి ఉన్నాయి. నీట్ గా టైప్ చేయబడిన ఆ రిపోర్ట్స్ వంక చూస్తున్న కొద్దీ అతనిలో అసహనం పెరిగిపోతూంది.

వాటిలో ఒకటి: మాధవి పంపిన జలంలో డయాక్సిన్ కలసి వుందనీ, ఆమె అనుమానం నిజమేనని ధృవపరుస్తూ

కెమికల్ లాబ్ వారు పంపిన రిపోర్టు.

రెండవది: ఆయేషా గురించి ఎంక్వయిరీ చేసి సి.బి.ఐ. పంపిన రిపోర్టు.

సి.బి.ఐ. రిపోర్టును చేతులలోనికి తీసుకొని, మరోసారి చదివాడతడు.

చిమన్ భాయి పటేల్ కు బొంబాయిలోని తాజ్ కోరమండల్ ఫైవ్ స్టార్ హోటల్ లో ఒక డాన్సర్ గా పరిచయం అయింది ఆమె.

తన అందంతో అతనిని ఆకర్షించింది. ఆమె వంపు, సొంపులను చూసి పిచ్చెక్కిపోయాడతడు.

అతనిని వివాహం చేసుకొని, అతనితో పాటుగా మినీకాయ్ దీవులకు వెళ్ళిపోయిందామె.

అయితే విచిత్రమైన విషయం ఏమిటంటే, చిమన్ భాయి పటేల్ బొంబాయి వచ్చేముందు, కేవలం కొన్ని రోజుల క్రితమే ఆ హోటల్ లో డాన్సర్ గా చేరిందామె.

అంతకు క్రితం ఆమె ఏం చేసేదో, ఎక్కడ నుండి వచ్చిందో ఎవరికీ తెలియదు.

కాని, ఆయేషా ఫోటోను చూస్తుంటే, పాకిస్తాన్ ఇంటలిజెన్స్ స్టార్ ఏజెంట్ జుబేదాకూ, ఆమెకూ చాలా దగ్గర పోలికలు కన్పిస్తున్నాయి.

అతడు రిపోర్టును చదవడం పూర్తిచేసాడు.

'అదే నిజమైతే....పాకిస్తాన్ స్టార్ ఏజెంట్ పనిగట్టుకొని ముసలి పటేల్ ను పెళ్ళాడి, మినీకాయ్ దీవుల్లో కాపురం పెట్టిందీ అంటే....

దీని వెనుక పెద్ద గ్రంథమే ఉండాలి' అతడు తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

దీనికన్నా ఆయనను కలవర పెడుతున్నది........గత

రెండు రోజులుగా, ఎంత ప్రయత్నించినా రాంకుమార్ గాని, మాధవిగాని కాంటాక్టు కాకపోవటం.

'ఏమయ్యారు వీరిద్దరూ?

ఒకవేళ జరుగరానిదేమైనా జరిగి వీరుకూడా ఆ వైద్య బృందం లాగే....' ఆ తరువాత ఆలోచించే శక్తిలేక నిస్సత్తువుగా కర్చీలో కూలబడ్డాడు అతడు.

'ఈ పరిస్థితులలో ఏం చేయాలి తను? మినీకాయ్ దీవులపై దాడిచేయాలా? లేక వారి దగ్గర నుండి మెసేజ్ వచ్చేంతవరకూ వేచి ఉండాలా?'

ఏదీ నిర్ణయించుకోలేక పోతున్నాడు అతడు.

అదే సమయంలో....ప్రాణం పోసుకుంటున్నట్లుగా అతని యెదురుగా టేబిల్ పైనున్న ఫోన్ మ్రోగటం ప్రారంభించింది.

ఆత్రంగా రిసీవర్ను అందుకున్నాడతడు.

రిసీవర్ గుండా వినవస్తున్న మాటలు చెవిని పడేసరికి నల్లగా మాడిపోయింది అతని ముఖం, రిసీవర్ పై అతని చేతివేళ్ళు గట్టిగా బిగుసుకున్నాయి.

"నేను వెంటనే బలగంతో బయలుదేరి వస్తున్నాను మాధవీ!

నీ ఎలర్టు! ఉంటానూ!" అంటూ రిసీవర్ను క్రెడిల్ పై వుంచాడతడు.

10

"నో! వద్దు రజాక్!

ఆ డ్రమ్ములలోని దయాక్సిన్ను ఇప్పుడప్పుడే సముద్ర జలాలలో కలపవద్దు" అంది ఆయేషా.

ఆమె వంక అర్థంకానట్లు చూసాడు రజాక్ అని పిలవబడ్డ ఆ అనుచరుడు.

"ఒక వారం రోజులు ఆగాలి రజాక్! ఈ వారం రోజులూ ఈ దీవిలోని ప్రజలు ఏ జలచరాలనూ ఆహారంగా తీసుకోరు" అందామె చిన్నగా నవ్వుతూ.

ఈ దీవి ప్రజలు తీసుకోని ఆహారానికీ, తాము సముద్రంలో కలిపే ఈ విసర్జిత రసాయనానికీ మధ్య ఉన్న బాదరాయణ సంబంధం ఏమిటో అర్థంగాక తెల్లబోతూ చూసాడతడు.

"ఈ దీవి మన స్వంతం కావాలంటే, ఈ దీవిలోని మానవజాతి అంతరించిపోవాలి రజాక్! అందుకే విషపూరితమైన ఈ డయాక్సిన్ ను ఇక్కడి సముద్రజలాలలో కలపటం.

ఇప్పుడే మనం ఈ డయాక్సిన్ ను ఈ సాగరజలాలలో కలిపామనుకో, ఈ విష రసాయనాన్ని మింగిన చేపలు ఈ వారం రోజులలో చనిపోతాయి. చచ్చిన చేపలను ఈ దీవి ప్రజలు తినరు రజాక్!

అందుకే ఈ విషాన్ని ఫ్రెష్ గా చేపల ద్వారా వీరికి అందివ్వాలంటే....మనం మరో వారం రోజులు ఆగాలి" క్రూరంగా నవ్వుతూ అంది ఆమె.

వెంటిలేటర్ లోనుండి, లోపలకు చూస్తూ, ఆమె మాటలను వింటున్న రాంకుమార్ ఆవేశంతో వణికిపోయాడు.

"యూ డర్టీ బిచ్!" అనుకున్నాడు అతడు కసిగా పళ్ళు కొరుకుతూ.

వారం రోజులపాటు ఏ జలచరాన్నీ ఆహారంగా తీసుకోవద్దని జన్మకారణ్ ఆదేశించినప్పుడు, ఆయేషా యెందుకు ముఖాన్ని నల్లగా మాడ్చుకుందో అప్పుడు అర్థం అయింది అతనికి.

"ఈ దీవి మన స్వంతం అయిననాడు దీనిని బేస్‌గా తీసుకొని, ఇండియన్ వెస్ట్రన్ కోస్టల్‌లోని ముఖ్య ప్రదేశాలపై ఎటాక్ చేయటం మనకు చాలా సులువు.... రజాక్!

అప్పుడే మన సైనికులు ఈ దీవి పశ్చిమ భాగంలో స్థావరాలను నిర్మిస్తున్నారు. ఈ మినీకాయ్ దీవి మన ఇస్లాం పతాకం క్రిందకు రావటానికి యింకెంతో కాలం పట్టదు" అంది ఆయేషా.

అంతటితో—

మినికాయ్ దీవుల రహస్యం అంతా మంచులా విడిపోయినట్లు అనిపించింది అతనికి.

యిక తను ప్రత్యక్షంగా రంగంలోనికి దిగాల్సిన సమయం వచ్చిందని అనుకున్నాడతడు. వెంటిలేటర్ పైనుండి క్రిందకు దిగడానికి ఉద్యుక్తుడగుతూ...

అంతలో....

ఎందుకో యథాలాపంగా తల ఎత్తి చూసిన ఆయేషా కంటపడ్డాడు అతడు.

"కుమార్!" అంటూ ఆశ్చర్యంతో చిన్నగా అరిచింది ఆమె. మరుక్షణం రజాక్ దివ్వున గదిలోనుండి బయటకు పరుగెత్తాడు.

ఆయేషా తనను చూసిందని గ్రహించిన వెంటనే, ఒకక్షణం కూడా తాత్సారం చేయకుండా క్రిందకు దూకాడు రాంకుమార్. రెండడుగులు ముందుకు వేసేసరికి కాలయముడిలా నిలుచున్న రజాక్ ఎదురయ్యాడతనికి.

తన చేతిలోని స్టెన్ గన్‌ను రాంకుమార్ గుండెలకు గురిపెట్టబోతున్నాడతడు. ఒక్క క్షణం రజాక్‌కు తనకూ మధ్యనున్న దూరాన్ని అంచనా వేసాడతడు.

అంతే!

నిలుచున్నవాడు, నిలుచున్నట్లుగానే గాలిలోనికి ఎగిరాడు రాంకుమార్. గుండెలు జలదరింపజేసే కుంగ్‌ఫూ షౌట్ అతడి కంఠంలోనుండి వెలువడింది. ఎడమకాలు స్ప్రింగ్‌లా మడిచి, కుడికాలును ఫ్లాట్‌గా వుంచి రివ్వున ఎగిరి రజాక్ గుండెలపై తన్నాడతడు.

రెండంగుళాల మందం ఉండే బలమైన చెక్క తలుపులను సైతం ముక్కలు చేయగల ఫ్లయింగ్ కిక్ అది.

గుండెలు పగిలి, రక్తం కక్కుతుంటూ అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు రజాక్.

రజాక్ శవం పైనుండి గెంతుతుంటూ ఆ గదిలోనికి ప్రవేశించాడతడు.

ఆశ్చర్యం!

అక్కడ ఆయేషా లేదు.

"ఎక్కడకు తప్పించుకుపోతావు ఆయేషా! ఆ దీవి ప్రజలకు నీవు చేసిన ద్రోహానికి నిన్ను చిత్రవధ చేయనిదే విడిచిపెట్టను" అనుకున్నాడు అతడు, ఆ గదిలోనుండి బయటకు వస్తూ.

అదే సమయంలో చెవులు చిల్లులు పడేలా వినిపించిందొక సైరన్ మ్రోత. పుట్టలలోనుండి వెలువడ్డ చీమల్లా ఆ భవనంలోనుండి బయటకు వచ్చారు నల్లని దుస్తులను ధరించిన ఆయేషా అనుచరులు.

వారిని చూసి, షార్ప్‌గా లెఫ్ట్‌కు టర్న్ అయి, ఆ భవనం వెనుక భాగంవైపు పరుగెత్తాడు రాంకుమార్.

అప్పుడు అతడున్నది ఆ భవనంయొక్క మూడవ ఫ్లోర్‌లో. ఆయేషా కూడా ఆ ఫ్లోర్‌లోనే ఏదో గది లోనో దాక్కొని ఉండాలి.

ఆ భవనం నిండా చీమల బారుల్లా తిరుగాడుతున్న ఆయేషా అనుచరులను చూశాక, ఆమె ఎక్కడుందో వెదుకుదామన్న ఆలోచన అతనిలో అంతరించిపోయింది.

"ఓ.కే! బేబీ! ఈ భవనంనుండి నిన్ను ఎలా బయటికి రప్పించాలో నాకు బాగా తెలుసు" అనుకున్నాడతడు ఆ భవనం వెనుక భాగానున్న నీటి పంపును పట్టుకొని జర్రున క్రిందకు జారుతూ.

నేలమీద కాలు మోపిన మరుక్షణం గ్రౌండ్ ఫ్లోర్ లో నున్న ఒక్కొక్క గదినీ పరిశీలించటం ప్రారంభించాడతడు. సరిగ్గా అయిదు నిముషాల తరువాత అతని అన్వేషణ ఫలించింది.

ఒక గదిలో నీట్ గా పేర్చబడ్డ ఆయిల్ డ్రమ్ములను చూడగానే వికృతమైన హాసం ఒకటి అతని పెదవులపై నర్తించింది. రెండు డ్రమ్ముల మూతలను ఊడదీసి ఆయిల్ ను నేలమీద క్రుమ్మరించాడతను.

భవనం వెనుక మండుతున్న గాడీ పొయ్యిలోనుండి రెండు కట్టెలను తెచ్చి, ఆ గదిలోనికి విసిరాడు.

అంతే!

భగ్గున మంటలు అంటుకున్నాయి. ఆయిల్ డ్రమ్ములు అంటుకొని బాంబుల్లా ప్రేలటంతో, ఆ భవనం కంపించింది. నాలికలు చాస్తూ ఆ మంటలు మెల్లగా రెండవ ఫ్లోర్ లోనికి వ్యాపించసాగాయి.

మంటల్లో చిక్కుకున్న తమ భవనాన్ని చూసి కంగారుపడ్డారు ఆయేషా, ఆమె అనుచరులు.

అదే సమయంలో ఆ భవనం ముందు ఆగాయి రెండు పోలీస్ వ్యాన్ లు, ఒక జీపు. వాటిలోనుండి బిల, బిల

మంటూ దిగుతున్న స్పెషల్ పోలీస్ స్క్వాడ్ నూ, జీప్ లోనుండి క్రిందకు దిగుతున్న త్రివేంద్రం పోలీస్ కమీషనర్ నూ, మాధవినీ చూసేసరికి ఆయేషా ముఖం నల్లగా మాడిపోయింది.

'తన రహస్యం బయటపడిందని' గ్రహించింది ఆమె. 'ఎటాక్' అంటూ గట్టిగా అరిచింది ఆమె. ఆమె అనుచరులు పోలీసులపై తుపాకులను గురిపెట్టారు. ఆ భవనం చుట్టూ వలయంలా యేర్పడి తాము కూడా యెదురు కాల్పులను సాగించారు పోలీసులు.

పోరు ప్రారంభమయింది. తుపాకీ మ్రోతలతో ఆ దీవి దద్దరిల్లిపోయింది.

ఎవరూ ఆపే ప్రయత్నం చేయకపోవటంతో, నిరాటంకంగా ఆ భవనం అంతటా వ్యాపించసాగాయి ఆ మంటలు. వాటిని ఆపాలంటే వారు భవనంలోనుండి బయటకు రావాలి. బయటకు వస్తే పోలీసుల తుపాకీ గుళ్ళకు గురికావాలి.

తమ పరిస్థితి ఇరకాటంలో పడిందని గ్రహించిందామె. ముందట ఈ భవనంలోనుండి బయటపడాలి అనుకుందామె. ఆ గదిలోని గోడకు అమర్చబడ్డ ఒక రహస్య ద్వారాన్ని తెరుస్తూ. ఆ త్రోవ భూగర్భంగుండా సాగర తీరానికి దారి తీస్తూంది.

ఒక చెట్టు చాటున నిలబడి పరిస్థితి నంతటినీ సమీక్షించుకుంటున్నారు రాంకుమార్, మాధవి, పోలీస్ కమీషనర్.

వారికి తెలుసు. ఇంకొద్ది సేపటిలో మంటల వేడికి తట్టుకోలేక ఆయేషా అనుచరులంతా ఆ భవనం వీడి బయటకు వచ్చేస్తారని, తమ చేతుల్లో చిక్కుకుంటారని.

అదే సమయంలో భారత సైనికదళాలు, ఆ దీవి పశ్చిమానున్న పాక్ సైనికులపై దాడిచేస్తుంటారని కూడా వారికి తెలుసు.

'మొత్తంమీద పరిస్థితి అంతా అదుపులోనికి వచ్చేసినట్లే!' అనుకున్నాడు పోలీస్ కమీషనర్ వీరోచితంగా పోరాడుతున్న తన సిబ్బంది వంక ప్రశంసాపూర్వకంగా చూస్తూ.

అదే సమయంలో

రహస్య మార్గంగుండా సాగర తీరం చేరుకుంది ఆయేషా. సముద్రపు ఒడ్డున లంగరు వేయబడ్డ స్టీమ్‌బోట్ వైపు నడిచింది.

సరిగ్గా మూడడుగులు వేసేసరికి, ఆమె దారికి అడ్డంగా ప్రత్యక్షమయ్యాడు ఆమె భర్త చిమన్ భాయి పటేల్. అతని చేతిలోని రివాల్వర్ సూటిగా ఆమె గుండెలకు గురిపెట్టబడి ఉంది.

"నీవు ఈ మార్గం గుండా నే వస్తావని నాకు తెలుసు ఆయేషా! అందుకే ఇక్కడ కాచాను.

నీ అందానికి దాసుడనై, నీ పుట్టుపూర్వోత్తరాలు కూడా తెలుసుకోకుండా నీ మెడలో తాళికట్టాను. ఈ దీవికి నిన్ను రాణిని చేశాను.

కాని, నీవు మనిషివి కావని, అమాయకులైన ఈ దీవి ప్రజల ప్రాణాలను హరించడానికి వచ్చిన నరహంతకివని గ్రహించలేకపోయాను.

చావు రాక్షసీ....చావు!

ఈ దీవికి నాయకుడిగా పట్టిన నీ శని నా చేతులతో నే విరగడ కావాలి!"

పట్టలేని ఉద్రేకంలో ఊగిపోతూ ట్రిగ్గర్ నొక్కా.

డతడు.

నిలుచున్న మనిషి నిలుచున్నట్లుగానే కట్టెలా వెనక్కు వ్రాలిపోయిందామె. వెంట్రుకవాసిలో ఆమె గుండెలపైనుండి గాలిలో దూసుకుపోయింది ఆ రివాల్వర్ గుండు. నేలమీద వ్రాలిన మరుక్షణం స్ప్రింగ్‌లా పైకి లేచిందామె. తటిల్లతలా ముందుకు ఉరికింది.

అతడు మరోసారి రివాల్వర్‌ను పేల్చబోయాడు. కాని అప్పటికే విసురుగా లేచిన ఆమె కుడికాలు అతని చేతిలోని రివాల్వర్‌ను ఎగురగొట్టింది.

చేతి వ్రేళ్ళను పులిపంజాల్లా బిగించి బలంగా అతని కంఠంపై మోదింది ఆమె. మార్షల్ ఆర్ట్స్‌లో టైగర్ పంచ్‌గా పేరుపొందిన ఆ స్ట్రోక్‌కు, కంఠనాళాలు తెగిపోయి, విగతజీవుడై నేల వాలిపోయాడు పటేల్.

అతని శవాన్ని దాటుకుంటూ స్టీమ్‌బోట్ వైపు పరుగెత్తిందామె.

స్టీమ్‌బోట్ స్టార్టయిన శబ్దం వినిపించేసరికి ఉలిక్కిపడి చూశాడు రాంకుమార్. బోట్‌లో కూర్చున్న ఆయేషాను చూడగానే వేటకుక్కలా సముద్ర తీరానికి పరుగెత్తాడతడు.

అప్పటికే ఆయేషా నడుపుతున్న బోటు సముద్రంలోనికి దూసుకుపోయింది. ఒడ్డున వున్న మరో స్టీమ్ బోట్‌ను స్టార్టు చేశాడతడు.

అనంతమైన సాగరంలో ఆ రెండు బోట్లూ పోటీపడుతూ శరవేగంగా దూసుకుపోతున్నాయి.

ఎవరిదో చేయి తన భుజంమీద పడేసరికి ఉలిక్కిపడి చూశాడు రాంకుమార్. అతని వెనుకే పరుగెత్తుకుంటూ వచ్చి, ఆఖరిక్షణంలో బోట్‌లోనికి జంప్ చేసిన మాధవి,

నవ్వుతూ అతని వంక చూసింది.

అయేషా నడుపుతున్న బోటు సరిగ్గా పది అడుగుల దూరంలో ఉండనగా.... రాంకుమార్ మాధవికి ఏదో సైగచేశాడు. ఆమె చటుక్కున లేచి ఒక పెట్రోల్ టిన్‌ను అందుకుంది. అదేక్షణంలో అయేషా బోటును సమీపించింది వారి బోటు. చేతి పెట్రోల్ టిన్ మూతను ఊడదీసి బలంగా ఆ బోటుమీదకు విసిరింది ఆమె.

అయేషా బోటునిండా పెట్రోలు వర్షంలా చిమ్మింది. అదేక్షణంలో రాంకుమార్ రివాల్వర్‌ను పేల్చాడు. అంతే! గుప్పుమని మంటలు అంటుకున్నాయి.

మంటల్లో చిక్కుకున్న తన బోటు వంక భయంగా చూసింది అయేషా. మరో రెండు నిముషాల్లో పెట్రోల్ టాంక్ అంటుకొని ఆ బోటు బాంబులా పేలిపోతుందని ఆమెకు తెలుసు.

అందుకే, తాత్సారం చేయకుండా స్టీరింగ్‌ను వదిలి నీటిలోనికి డైవ్ చేసిందామె.

అయితే.... ఆమె దురదృష్టం!

సూటిగా వెళ్ళి ఒక పెద్ద షార్క్‌ల గుంపు మధ్య పడిందామె. వాడియైన వాటి శరీరపు అంచులు తగిలి ఆమె శరీరం కోసుకుపోయి రక్తం చిమ్మింది.

రక్తపు వాసన సోకడంతోనే పిచ్చెక్కిపోయాయి ఆ షార్క్‌లు. తెల్లని కోరలను చాస్తూ తనను సమీపిస్తున్న షార్క్‌లను చూసేసరికి భయంతో కంపించిపోయిందామె.

వాటి మధ్యనుండి తప్పించుకొని పోవాలని విఫల యత్నం చేసిందామె. కాని అప్పటికే ఆ షార్క్‌లు ఆమెను చుట్టుముట్టాయి. మెల్లగా ఆమె శరీరాన్ని కోరలతో చీలుస్తూ కొరుక్కు తినసాగాయి.

భరించలేని బాధతో విలవిలలాడిపోతున్న అయేషాను చూస్తూ....

'ప్రాణం నిలిచి ఉండగానే, శరీరంలోని ఒక్కొక్క కండనూ షార్క్స్ పీక్కుతినడం కంటే భయంకరమైన శిక్ష....బహుశ యమలోకంలో కూడా ఉండదు.

'అయేషా, నీలాంటి నరహంతకికి ఇదే సరైన శిక్ష!' అనుకున్నాడు రాంకుమార్.

సాగర జలాలను విషపూరితం చేసి, ఏ జలచరాల ద్వారా ఆ దీవి ప్రజల ప్రాణాలను తీద్దామని సంకల్పించిందో....ఆ జలచరాల ద్వారానే ఆమె ప్రాణాలు పోవడం నిజంగా దైవ లీల!

—:అ యి పో యి ం ది:—